**సమస్యలపై పోరాటానికి సిద్ధం: కల్వకుంట్ల కవిత**



3లో

# PCW తెలుగు దినపత్రిక

PCW News Broadcasting PVT Ltd

**ఘనంగా అన్వేష్ , శైలజ వివాహ వేడుక**



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 180 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- శుక్రవారం 26 జూన్ 2026


## రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు

# బీమా భరోసా

**ఒక్క రూపాయి భారం లేకుండా రూ. కోటి 25 లక్షల ఉచిత ప్రమాద బీమా**

● అదనంగా పనిచేయండి..ఆదాయం పెంచండి... ● పన్ను కట్టని అక్రమార్కులను కట్టడి చేయాలి ● రాష్ట్ర ప్రయోజనాల కోసమే ఢిల్లీ వెళ్తున్నా : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యలు ● ఉద్యోగులకు రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాదబీమా ● 16 బ్యాంకులతో ప్రభుత్వం ఒప్పందం ● కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, తాత్కాలిక ఉద్యోగులకూ వర్తింపు



**హైదరాబాద్,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని ప్రభుత్వ ఉద్యోగులు ఒకగంట అదనంగా పనిచేసి ఆదాయాన్ని పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కోరారు. పన్నులు కట్టకుండా ఉండే అక్రమార్కులను కట్టడి చేస్తే ఆదాయం పెరుగుతుందని చెప్పారు. గురువారం హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు బీమా రక్షణ కల్పించేందుకు అవగాహన ఒప్పందం కార్యక్రమాన్ని నిర్వహించారు. 16 బ్యాంకులు ప్రభుత్వ ఉద్యోగులకు ఉచిత ప్రమాదబీమాను కల్పించేందుకు ఒప్పందం కుదుర్చుకున్నాయి. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వం, ఉద్యోగులు ఒక్క రూపాయి చెల్లించకుండా రూ.కోటి ప్రమాద బీమా ఎలా సాధ్యమని అనిపించిందని చెప్పారు. కానీ ప్రమాదవశాత్తు మరణించిన 45 మంది సింగరేణి కార్మికుల కుటుంబాలకు రూ.కోటి బీమా సొమ్మును అందించిన తర్వాత ఇది సాధ్యమని నిరూపితమైందని అన్నారు. అందుకే రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు కూడా ఈ బీమాను అమలు చేసేందుకు నిర్ణయించామని తెలిపారు. ఈ ప్రమాద బీమా ఉద్యోగుల కుటుంబాలకు ఒక ధైర్యాన్ని, భరోసాను మిగతా2లో...

# జల వివాదాలను పరిష్కరించుకుందాం

## -తుంగభద్ర గేట్ల ప్రారంభం చరిత్రలో నిలవాలి

**పంచాయితీలు కాదు...పరిష్కారాలు ముఖ్యం**

**మూడు రాష్ట్రాల పరిధిలో సమస్యలకు పరిష్కారం చూపాలి**

**కేంద్రమంత్రి పాటిల్ దీనిని అవకాశంగా తీసుకోవాలి**

**తుంగభద్రలో 15 టీఎంసిలకు 5 టీఎంసిలే అందుతున్నాయి**

**మునీరాబాద్ బహిరంగ సభలో సీఎం రేవంత్‌రెడ్డి**





**బళ్లారి,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** తుంగభద్ర నది ఒడ్డున.. బళ్లారి వేదికగా జరిగిన ఈ సమావేశం అంతర్రాష్ట్ర నదీ జలాల వివాదానికి శాశ్వత పరిష్కారం చూపిస్తుందని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆకాంక్షించారు. తుంగభద్ర ప్రాజెక్టుకు ఏర్పాటు చేసిన 33 నూతన గేట్ల ప్రారంభోత్సవ కార్యక్రమం అనంతరం ఏర్పాటు చేసిన సభలో సీఎం మాట్లాడారు.'తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ ముహూర్తం చరిత్రలో నిలిచిపోతుంది. 3 తరాల సమస్యలను 33 గేట్ల పునరుద్ధరణ పరిష్కరించబోతోంది. బళ్లారి, కర్నూలు, అనంతపురం, పాలమూరు సమస్యలు తీరుస్తుంది. తక్కువ మాట్లాడటం. అత్యంత వేగంగా పనిచేయడం సీఆర్ పాటిల్ ప్రత్యేకత. అలాంటి వ్యక్తి.. కేంద్ర జల్‌శక్తిశాఖ మంత్రిగా మిగతా2లో...

## సర్ ప్రక్రియపై రాజకీయాలు తగవు

**- ఇది రాజ్యాంగబద్ధ ప్రక్రియ మాత్రమే**

**- కేంద్రమంత్రి కిషన్ రెడ్డి స్పష్టీకరణ**



**హైదరాబాద్,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** రాజ్యాంగబద్ధమైన సర్ పక్రియను రాజకీయం చేయొద్దని మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. 'సర్ పక్రియ ఒక చట్టబద్ధమైన, రాజ్యాంగబద్ధమైన పక్రియ మాత్రమేనని, మిగతా2లో...

## ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

**- అభివృద్ధిని ఓర్వేలకపోతున్న బావాబామ్మర్దులు**

**- ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను ప్రారంభించిన టీపీసీసీ చీఫ్**



**హైదరాబాద్,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఇందిరా గాంధీ.. ఎస్టీ రిజర్వేషన్ ఇవ్వకపోయి ఉంటే నేడు లంబాడీలు, ఎరుకల, యానాదిలు ఈ స్థాయిలో ఉండేవాళ్లు కాదని టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. లంబాడీల బాగు కోసం పనిచేసే ప్రభుత్వం తమది అని స్పష్టం మిగతా2లో...

# వెనిజులాలో భూ ప్రళయం

**వెనిజులాను వణికించిన వరుస భూకంపాలు**

**39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూప్రకంపనలు**

**నేలమట్టం అయిన భారీ భవనాలు..ఇళ్లు, భవన సముదాయాలు**

**ప్రాథమిక సమచారం మేరకు 32 మంది మృతి**

**దాదాపు శతాబ్దకాలం తరవాత అతిపెద్ద భూకంపంగా నమోదు**

**అత్యవసర పరిస్థితి ప్రకటించిన అధ్యక్షురాలు రోడ్రిగేజ్**



**కారకాస్,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** వెనిజువెలాలో కేవలం నిమిషం తేడాలో రెండుసార్లు భారీ భూకంపం వణికించింది. బుధవారం స్థానిక కాలమానం ప్రకారం సాయంత్రం ఆరు గంటల సమయంలో వెనిజువెలాలో రెండుసార్లు భూమి కంపించింది. తొలుత రిక్టర్ స్కేల్‌పై తీవ్రత 7.2 కాగా, ఆ తర్వాత 7.5 తీవ్రతతో భూ ప్రకంపనలు నమోదు అయ్యాయి. ఆ భూకంపాల ధాటికి భారీ బిల్డింగ్‌లు నేలమట్టం అయ్యాయి. లా గౌరియా ప్రాంతం తీవ్రంగా ప్రభావానినికి గురైంది. అయితే ఆ భూకంపాల వల్ల 32 మంది మృతిచెందగా, 700 మంది గాయపడినట్లు ఆ దేశ తాత్కాలిక అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. డజన్ల సంఖ్యలో బిల్డింగ్‌లు కూలాయని, వీలైనంత వరకు అందర్నీ రక్షిస్తున్నామని, రెస్క్యూ ఆపరేషన్ చేపట్టామని, లా గౌరియా మిగతా2లో...



## బీసీ గురుకుల విద్యాసంస్థల బలోపేతం

**ఐఐఐటీలు, ఎన్ఐటీలలో విద్యార్థులకు ట్యాప్‌టాప్‌లు**

**విద్యార్థి మరణిస్తే కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా**

**మంత్రి పొన్నం ప్రభాకర్ వెల్లడి**

**హైదరాబాద్,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** బీసీ గురుకుల విద్యాసంస్థల బలోపేతం, విద్యార్థుల సంక్షేమం లక్ష్యంగా తెలంగాణ ప్రభుత్వం పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన జరిగిన బోర్డ్ ఆఫ్ గవర్నర్స్ సమావేశంలో గురుకుల విద్యాసంస్థలకు సంబంధించిన పలు ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. ఈ సందర్భంగా మహాత్మా జ్యోతిరావు పూలే గురుకుల మిగతా2లో...



## గతాన్ని మరచి పోండి.. అలాంటి పొరపాట్లు జరగవు

**ఇకముందు మిమ్ములను బాగా చూసుకుంటా...**

**వచ్చేది కెసిఆర్ ప్రభుత్వమే అంటూ..కార్యకర్తలకు కెటిఆర్ భరోసా**

**వికారాబాద్,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** వచ్చే ఐదేళ్లు మన ప్రభుత్వం వచ్చిన తర్వాత కార్యకర్తల బాగోగులు, ప్రజల సంక్షేమం రెండింటిని బ్యాలెన్స్‌గా నడిపించే బాధ్యత నాదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భరోసానిచ్చారు. 2028లో మీ అందరి దయతో కేసీఆర్ ముఖ్యమంత్రి అయితరు.. అయిన తర్వాత నేను బాధ్యత తీసుకుంటా.. అన్నారు. మీకు రావాల్సిన పదవులు.. జరుగాల్సిన లాభం. మీకు కోరుకునే గౌరవం వచ్చే విధంగా చేసే బాధ్యత నాది. గతం మరిచిపోండి.. చిన్నచిన్నపొరపాట్లు జరిగి ఉండొచ్చు. ఇక్కడ ఉద్యమంలో పనిచేసిన బిడ్డలు కూడా ఉన్నారు. వాళ్లకు కూడా అయ్యో మాకు జరుగాల్సిన న్యాయం జరుగలేదనే భావన ఉండొచ్చు. నేను వారందని మిగతా2లో...

## ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

**రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశాం**

**ఆర్థిక ఇబ్బందులు ఉన్నా.. అప్పులు చేసి ఇస్తున్నాం**

**పదివేల కోట్లు నష్టం వచ్చినా పంటలు కొనుగోలు చేశాం**

**సిఎం సభావేదికను పరిశీలించిన మంత్రి తుమ్మల**



2లో

## పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

● క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్లు ● జూన్ 28లోగా లొకేషన్ల ఖరారు ● జూలై మొదటి వారంలో బ్రోచర్ విడుదల ● మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి



**హైదరాబాద్,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**పేదల సొంతింటి కలను సాకారం చేయడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని ఆ కల నెరవేర్చే క్రమంలో వారి జీవనోపాధికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వారు ప్రస్తుతం నివసిస్తున్న ప్రాంతాలకు అత్యంత సమీపంలోనే క్యూర్ పరిధిలో పది అంతస్తుల్లో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం చేపడుతున్నామని రాష్ట్ర రెవెన్యూ, మిగతా2లో...

# వెనిజులాలో భూ ప్రళయం

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్రంలో పరిస్థితి భయానకంగా ఉందని అధ్యక్షురాలు రోడ్రిగేజ్ తెలిపారు. దేశ రాజధాని కారకాస్‌కు పశ్చిమ దిశలో 168 కిలోమీటర్ల దూరంలో ఉన్న కరీబియన్ తీరంలోని మోరన్ ప్రాంతంలో భూకంప కేంద్రం ఉన్నట్లు అమెరికా జియోలాజికల్ సర్వే ప్రకటించింది. సుమారు 22 కిలోమీటర్ల లోతులో భూమి కంపించినట్లు పేర్కొన్నారు. దాదాపు శతాబ్ద కాలం తర్వాత వెనిజువెలాలో భారీ భూకంపం సంభవించింది.మృతుల సంఖ్య లక్ష వరకు చేరుకునే అవకాశాలు ఉన్నట్లు యూఎస్ జియోలాజికల్ సర్వే పేర్కొన్నది. వెనెజువెలాను బుధవారం నాడు వరుస భూకంపాలు 39 సెకన్ల వ్యవధిలోనే రెండు భారీ భూకంపాలు సంభవించి తీవ్ర విధ్వంసాన్ని సృష్టించాయి. కరేబియన్ తీరంలోని మోరోన్ పట్టణానికి పశ్చిమాన 21 కిలోమీటర్ల దూరంలో 7.2 తీవ్రతతో మొదటి భూకంపం వచ్చింది. అదే పట్టణానికి సుమారు 45 కిలోమీటర్ల దూరంలో క్షణాల వ్యవధిలోనే 7.5 తీవ్రతతో మరో భూకంపం సంభవించింది. ఈ ఘటనలో 10 వేల నుంచి లక్ష మంది వరకూ ప్రాణాలు కోల్పోయి ఉండొచ్చని యునైటెడ్ స్టేట్స్ జియోలాజికల్ సర్వే అంచనా వేసింది. అలాగే వేల మంది ప్రజలు గాయపడి ఉండొచ్చని తెలిపింది. భూకంపాలతో అనేక భవనాలు నేలమట్టం కాగా, ప్రజలు భయంతో పరుగులు తీస్తున్న అనేక వీడియోలు నెట్టింట హల్‌చల్ చేస్తున్నాయి.

మొదటి భూకంపం వచ్చినప్పుడు ఒక్కసారిగా పెద్దపెద్ద భవనాలు కూలిపోవడం ప్రారంభమయ్యాయి. అనేక చిన్నచిన్న ఇళ్లు నేలమట్టం అయ్యాయి. ఏం జరుగుతుందో గ్రహించి, ప్రాణరక్షణ కోసం ప్రజలు పరిగెత్తే లోపే అంతకంటే ఎక్కువ తీవ్రతతో రెండో భూకంపం వచ్చింది. దీంతో భారీ విధ్వంసం జరిగింది. కొన్ని భారీ భవనాలు కూలిపోగా, మరికొన్ని బిల్డింగులు ఊగిపోయాయి. కొన్ని ఇళ్ల పైకప్పులు కూలిపోగా, శిథిలాల కింద అనేక మంది చిక్కుకుపోయారు. దీంతో తమ ప్రాణాలను, కుటుంబ సభ్యులను కాపాడు కునేందుకు స్థానికులు తీవ్ర ప్రయత్నాలు చేశారు.

# రాష్ట్రప్రభుత్వ ఉద్యోగులకు బీమా భరోసా

(మొదటి పేజీ తరువాయి)

ఇస్తుందని చెప్పారు. ఉద్యోగుల భద్రత యజమానిగా ప్రభుత్వానిదేనని స్పష్టం చేశారు.తనను కొందరు గుంపుమేస్త్రీ అని అవహేళన చేస్తుంటారని అన్నారు. 'అవును.. నేను... గుంపుమేస్త్రీనే...' అని చెప్పారు. ఉద్యోగుల గుంపంతా తనదేననీ, ఈ గుంపే తన బలం, ప్రతిష్ఠ అని వివరించారు. ఈ గుంపే పేదలకు, ప్రభుత్వానికి మధ్య వారధులని అన్నారు. హోదా, పదవి మారినా తాను ఎప్పటికీ రేవంతన్నగానే ఉంటానని చెప్పారు. పదవులు శాశ్వతం కాదనీ, ఈ అన్నదమ్ముల అనుబంధమే శాశ్వతంగా ఉంటుందని అన్నారు. అందరం కలిసి తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా తీర్చిదిద్దుదామని కోరారు. ధనిక రాష్ట్రంగా ఉన్న తెలంగాణను కేసీఆర్ పదేండ్లలో రూ.8.11 లక్షల కోట్ల అప్పులు చేసి దివాళా తీయించారని విమర్శించారు. పదేండ్లలో వందేండ్ల విధ్వంసం సృష్టించారని అన్నారు. కాంగ్రెస్ రాకముందు మొదటి తారీఖున జీతాలు ఇచ్చే పరిస్థితి ఉండేదాఅని ప్రశ్నించారు. ఎన్ని అవాంతరాలు ఎదురైనా మొదటి తారీఖున ఉద్యోగులకు జీతాలు అందిస్తున్నామని చెప్పారు. చెప్పిన మాట ప్రకారం విడతల వారీగా రిటైర్మెంట్ బెనిఫిట్స్‌కు సంబంధించిన నిధులను విడుదల చేస్తున్నామని వివరించారు. ఇంకా సమస్యలుంటే తమ దృష్టికి తేవాలనీ, చర్చించుకుని పరిష్కరించుకుందామని చెప్పారు. సంక్షేమ పథకాల అమల్లో ఉద్యోగుల కృషి ఉందన్నారు.రోజుకు ఒక గంట అదనంగా పనిచేసి రాష్ట్ర ఆదాయం పెంచితే ఉద్యోగుల అవసరాలను తీర్చడానికి వాటిని ఉపయోగిస్తామని వ్యాఖ్యానించారు. ప్రభుత్వానికి మంచి పేరు రావాలంటే అది ఉద్యోగుల చేతుల్లోనే ఉందని చెప్పారు. మూసీ ప్రక్షాళన, మెట్రో రైల్ విస్తరణ వంటి అభివృద్ధి పనులను చేయాలని అడ్డుకుంటామంటే కుదరదని ప్రతిపక్షలను హెచ్చరించారు. కేసీఆర్ కుటుంబాన్ని చింతమడకకే పరిమితం చేస్తామన్నారు.ఈ ప్రభుత్వానికి ఉద్యోగులే బ్రాండ్ అంబాసిడర్లని కితాబిచ్చారు. కార్యక్రమంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, పొంగులేటి శ్రీనివాసరెడ్డి, వివేక్ వెంకటస్వామి, అజారుద్దీన్, అడ్లూరి లక్ష్మన్ కుమార్, ప్రభుత్వ సలహాదారుడు హర్కర వేణుగోపాల్, సీఎస్ కే.రామకృష్ణారావు, జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బీఎమ్‌డీ ఎక్కా, ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి సందీప్ కుమార్ సుల్తానియా, కార్యదర్శులు సిక్తా పట్నాయక్, గౌరవ్ ఉప్పల్, డీజీపీ సీవీ ఆనంద్‌తో పాటు పలు బ్యాంకులకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.**దేశ చరిత్రలోనే తొలిసారి : భట్టి** ప్రభుత్వ ఉద్యోగులకు తమ 'ప్రజా ప్రభుత్వం' బంపర్ ఆఫర్ ప్రకటించిందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క అన్నారు. ఒక్క రూపాయి భారం లేకుండా రూ.1.25 కోట్ల ఉచిత ప్రమాద బీమా, విమాన ప్రమాదమైతే రూ.రెండు కోట్ల నుంచి రూ.మూడు కోట్ల వరకు రక్షణ ఉంటుందని చెప్పారు. ప్రభుత్వ ఉద్యోగులకే కాకుండా కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్, తాత్కాలిక సిబ్బందికీ ఈ బీమా వర్తిస్తుందని వివరించారు. ఇలాంటి పథకాన్ని దేశచరిత్రలోనే తొలిసారిగా ప్రవేశపెట్టామని చెప్పారు. ఉద్యోగుల కుటుంబాల్లో భద్రత, భరోసా కల్పించేందుకే ఇలాంటి చారిత్రాత్మక నిర్ణయం తీసుకున్నామని అన్నారు. ఈ పథకం కింద 18 నుంచి 60 ఏండ్ల వయస్సు గల ఉద్యోగులకు రూ.10 లక్షల జీవిత బీమా రక్షణ ఉంటుందన్నారు. ప్రమాదవశాత్తూ శాశ్వత సంపూర్ణ వైకల్యం లేదా పాక్షిక వైకల్యం సంభవించినా ఉద్యోగులకు ఆర్థిక భరోసా లభిస్తుందన్నారు. వారికి త్వరలోనే నగదు రహిత వైద్యం అందిస్తామనీ, ఆరోగ్య కార్డులను అందజేస్తామన్నారు. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్ ఎకానమీ, 2047 నాటికి తెలంగాణను మూడు ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా తీర్చిదిద్దేందుకు ఉద్యోగులు, బ్యాంకర్లు, ప్రభుత్వం సమష్టిగా, చేయి చేయి కలిపి ముందుకు సాగాలని ఆయన ఆకాంక్షించారు.**ప్రభుత్వానికి కృతజ్ఞతలు :** ఉద్యోగ జేఏసీ ఉచిత ప్రమాద బీమాను అమలు చేస్తున్నందుకు రాష్ట్ర ప్రభుత్వానికి తెలంగాణ ఉద్యోగ జేఏసీ చైర్మెన్ మారం జగదీశ్వర్, సెక్రెటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు కృతజ్ఞతలు చెప్పారు. ఇదే స్ఫూర్తితో ఉద్యోగులకు సంబంధించిన సీపీఎస్ రద్, పీఆర్సీ, డీఏ బకాయిలు, పెండింగ్ బిల్లుల సమస్యలను కూడా పరిష్కరించాలని కోరారు. తెలంగాణను దేశంలోనే నెంబర్‌వన్‌గా నిలబెట్టేందుకు ఉద్యోగులు పనిచేస్తారని అన్నారు.

# జల వివాదాలను పరిష్కరించుకుందాం

(మొదటి పేజీ తరువాయి)

ఉండటంతో ఏపీ, తెలంగాణ, కర్ణాటకలో సాగు, తాగునీటి సమస్యలకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందని సంపూర్ణంగా విశ్వసిస్తున్నానని అన్నారు. నీటి సమస్యలు పరిష్కరించకపోవడంతో నీరంతా సముద్రంలో కలుస్తున్నాయి. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్‌లో పాలమూరుకు కేటాయించిన 15 టీఎంసీలలో కేవలం 5 టీఎంసీలు మాత్రమే వాడుకోగలుగు తున్నాం. దాదాపు 10 టీఎంసీల నీరు మా వరకూ రావట్లేదు. రాజోలిబండ సమస్యను సీఆర్ పాటిల్, చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. తుంగభద్ర గేట్ల పునరుద్ధరణ పనులు చరిత్రలో నిలుస్తాయని తెలంగాణ ముఖ్య మంత్రి రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. పాలమూరు వలసల గురించి తనకు అవగాహన ఉందని తెలిపారు. మూడు రాష్ట్రాల కరువు జిల్లాలకు ఇది పరిష్కారం చూపబోతోందని పేర్కొన్నారు. గురువారం తుంగభద్ర డ్యాం కొత్త స్పీల్ వే గేట్లు ప్రారంభించాక, కర్ణాటక కొప్పల్ జిల్లా మునీరాబాద్ బహిరంగ సభలో సీఎంలు రేవంత్‌రెడ్డి, చంద్రబాబు, డీకే శివకుమార్ పాల్గొన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రసంగించారు. కర్నూలు, అనంతపురం రైతుల సమస్యలు తనకు తెలుసు అని చెప్పుకొచ్చారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి సమస్య పరిష్కారానికి అడుగులు పడుతున్నాయని తెలిపారు. నీటి సమస్యలు పరిష్కరించుకోకపోవడంతో నీరు సముద్రం పాలవుతో ందని చెప్పారు. మూడు రాష్ట్రాల మధ్య నీటి చర్చలు ఓ కొలిక్కి వచ్చాయని అన్నారు. తుంగభద్ర నుంచి 10 టీఎంసీల నీరు తమకు రావడం లేదని చెప్పారు. ద రైతులకు న్యాయం జరగాలని తాము ఆశిస్తున్నామని అన్నారు.

# బీసీ గురుకుల విద్యాసంస్థల బలోపేతం

(మొదటి పేజీ తరువాయి)

విద్యాసంస్థల పేరును మార్చేందుకు ఆమోదం తెలిపారు. మహాత్మా జ్యోతిరావు గురుకుల పాఠశాలలు ఇక నుండి తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ మహాత్మా జ్యోతిరావు పూలే విద్యా సంస్థల సొసైటీగా మార్పు చేస్తున్నట్లు ప్రకటించారు. అలాగే ఐఐటీలు, ఎన్ఐటీల వంటి జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో ప్రవేశం పొందిన విద్యార్థులకు ల్యాప్‌టాప్‌లు అందించాలని నిర్ణయించారు. ఉన్నత విద్యలో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించడమే దీని ఉద్దేశమని మంత్రి తెలిపారు. ఎంజేపీ వ్యవసాయ కళాశాలల్లో ఎంజేపీ విద్యార్థులకే ప్రవేశాలు కల్పించడంతో పాటు విద్యార్థుల సంక్షేమానికి సంబంధించిన పలు సంస్కరణలకు సమావేశం ఆమోదం తెలిపింది. విద్యార్థి మరణించిన సందర్భంలో కుటుంబానికి రూ.2 లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని నిర్ణయించారు. ప్రిన్సిపాల్ నియామకాలలో ప్రస్తుతం అమలులో ఉన్న 70 శాతం ప్రమోషన్లు, 30 శాతం ప్రత్యక్ష నియామకాల విధానాన్ని కొనసాగించాలని సమావేశం నిర్ణయించింది. అలాగే రిటైర్డ్ ప్రిన్సిపాళ్లను అకడమిక్ కన్సల్టెంట్లుగా వినియోగించే అంశంపై కమిటీ ఏర్పాటు చేయనున్నారు. పాఠశాలలు, కళాశాలల బడ్జెట్ పరిమితులకు ఆమోదం తెలిపిన సమావేశం, గురుకుల పాఠశాలలకు డెస్క్‌టాప్ కంప్యూటర్ల కొనుగోలుకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. జూనియర్ కళాశాలలకు ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్స్ సరఫరాకు కూడా ఆమోదం లభించింది. రాష్ట్రంలో 12 సైనిక్ స్కూళ్ల ఏర్పాటుపై పూర్తి నివేదిక సమర్పించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. బీసీ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, పోటీ పరీక్షల్లో మరిన్ని విజయాలు సాధించేలా ప్రత్యేక చర్యలు చేపడుతున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. గురుకుల విద్యాసంస్థలను మరింత బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.పాఠశాలలు, జూనియర్ కళాశా లలు, డిగ్రీ కళాశాలలు, ప్రాంతీయ సమన్వయ కార్యాలయాల వివిధ విభాగాలకు బడ్జెట్ పరిమితులను బోర్డు ఆమోదించింది. సందర్భంగా మంత్రి శ్రీ పొన్నం ప్రభాకర్ గారు మాట్లాడుతూ, బీసీ విద్యార్థులకు అత్యుత్తమ విద్యా అవకాశాలు కల్పించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. విద్యా ప్రమాణాల పెంపు, పోటీ పరీక్షల్లో విజయాలు, జాతీయ స్థాయి విద్యాసంస్థల్లో అధిక ప్రవేశాలు సాధించేందుకు ప్రభుత్వం అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోందన్నారు.

# ప్రజాప్రభుత్వంలో రైతుభరోసాకు పెద్దపీట

**ఖమ్మం,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజాప్రభుత్వంలో అత్యంత ప్రాధాన్యం కలిగిన కార్యక్రమం రైతు భరోసా అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చెప్పారు. జులై నెలలోనే రైతులకు రైతుభరోసా ఇవ్వాలని నిర్ణయించినట్లు తెలిపారు. రెండేళ్లలో లక్ష కోట్లు రైతాంగానికి అందజేశామని వెల్లడించారు. తెలంగాణ రాష్ట్రంలో రైతులు పండించిన ప్రతి పంటను కొనుగోలు చేశామని అన్నారు. ఏడాదికి పది వేల కోట్లు నష్టం వచ్చినప్పటికీ కొనుగోలు చేస్తున్నామన్నారు. రాష్ట్రంలోని రైతులందరికీ కలిపి రైతు భరోసా కింద రూ.9 వేల కోట్లను ముఖ్యమంత్రి విడుదల చేయనున్నారన్నారు. ఈ సభకు రైతు ఆశీర్వాద సభగా రైతులే నామకరణం చేశారని తెలిపారు. ఖమ్మం జిల్లాలోని చింతకాని మండలం మత్కేపల్లి క్రాస్ రోడ్డులో ఈనెల 30న జరిగే సీఎం రేవంత్ రెడ్డి బహిరంగ సభా స్థలాన్ని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం కష్టంలో ఉందని, నిధుల కొరత ఉందని అయినా రైతాంగానికి అండగా ఉండాలని అప్పుచేసి మరీ రైతుభరోసా ఇస్తున్నామని చెప్పారు. ఈనెల 28న రైతు ఎగ్జిబిషన్ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 28, 29 రెండు రోజుల పాటు వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు సభా ప్రాంగణంలో అందుబాటులో ఉంటారన్నారు. 30న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బహిరంగ సభ జరుగుతుందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. భారత దేశంలో అత్యధికంగా పంటలు పండించిన రాష్ట్రం తెలంగాణ అని మంత్రి అన్నారు. వ్యవసాయ రంగంలో పంటమార్పిడి విధానంలో ఆయిల్ ఫాం సాగును ప్రోత్సహిస్తు న్నామన్నారు. భవిష్యత్తులో పది వేల ఎకరాలను రైతులు సాగు చేసే విధంగా సహకారం అందజేస్తు న్నామని చెప్పారు. దేశంలో తెలంగాణలోనే అత్యధిక ఆయిల్ ఫాం సాగు జరుగుతోందన్నారు. పామాయిల్ ఫ్యాక్టరీల నిర్మాణం శరవేగంగా జరుగుతోందని తెలిపారు. ఏడు రకాల వరి అందుబాటులో ఉందని రైతాంగానికి తుమ్మల తెలియజేశారు. వాతావరణ పరిస్థితులను బట్టి రైతులు పంటల సాగుపై దృష్టి సారించాలన్నారు. బ్లాక్ మార్కెట్‌లో యూరియా ఉంచుతున్నారని... నిల్వ చేసి అధిక ధరలకు అమ్మేందుకు చూస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులు ఎవరూ కూడా భయపడవద్దని.. అందరికీ యూరియా అందిస్తామని స్పష్టం చేశారు. యూరియా కోసం ప్రత్యేక యాప్‌ను తీసుకొచ్చామని.. అందులో అన్ని వివరాలు ఉన్నాయన్నారు. యూరియా కోసం తెచ్చిన యాప్ దేశానికే ఆదర్శమని ప్రధాని మోదీ కూడా ప్రశంసించే పరిస్థితి ఉందన్నారు. రైతాంగం పాడి పంటపై దృష్టి సారించాలని మంత్రి సూచించారు. అత్యధికంగా పురుగుల మందులు వాడుతున్నారని ఇక్కడి పంటలను విదేశాలు రిజెక్ట్ చేస్తున్నాయన్నారు.

# సర్ ప్రక్రియపై రాజకీయాలు తగవు

(మొదటి పేజీ తరువాయి)

దీనిని ఏ ఒక్కరూ రాజకీయ కోణంలో చూడకూడదన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. 'సర్ అనేది కేంద్ర ఎన్నికల సంఘం నిర్దేశించిన నిబంధనల ప్రకారం దేశవ్యాప్తంగా జరిగే ఒక నిరంతర పక్రియ అని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం, అదే సమయంలో నకిలీ లేదా అక్రమ ఓట్లను తొలగించి ఓటర్ల జాబితాను పారదర్శకంగా మార్చడమే దీని ప్రధాన ఉద్దేశమని వివరించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ పర్యవేక్షణలో, క్షేత్రస్థాయిలో బూత్ లెవెల్ అధికారులు ఇంటింటికీ తిరిగి ఈ సవరణలు చేపడుతున్నారని ఆయన తెలిపారు. ఓటర్ల జాబితా సవరణ అనేది ప్రజాస్వామ్యంలో చట్టబద్ధమైన పక్రియ అని, దీనిపై కొన్ని రాజకీయ పక్షాలు స్వార్థ ప్రయోజనాల కోసం దుష్ప్రచారం చేయడం సరైన పద్ధతి కాదని కిషన్‌రెడ్డి హితవు పలికారు. కొన్ని రాజకీయ పార్టీలు ఈ పక్రియపై కావాలనే అపోహలు సృష్టిస్తూ, ప్రజలను, అధికారులను గందరగోళానికి గురిచేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. గతంలోనూ కాంగ్రెస్ ప్రభుత్వం హయాంలో ఇటువంటి సవరణలు జరిగాయని గుర్తుచేసిన కేంద్రమంత్రి, ఇప్పుడు దీనికి రాజకీయ రంగు పులమడం వెనుక ఉన్న ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఓటర్ల జాబితాలో ఎలాంటి తప్పులూ లేని పారదర్శకత కోసం ప్రజలు కూడా ఈ '÷ూఎఖీ' పక్రియలో భాగస్వాములు కావాలని కిషన్‌రెడ్డి పిలుపునిచ్చారు.

# ఎస్టీ రిజర్వేషన్లు ఇందిరమ్మ పుణ్యం

(మొదటి పేజీ తరువాయి)

చేశారు. ఇందిరాగాంధీ గుడిసెలు లేని గ్రామాలు కావాలని అనుకున్నారని.. ఆ దిశగానే తాము ముందుకు వెళ్తున్నామని చెప్పారు. తెలంగాణ కాంగ్రెస్ గిరిజన నేతలు చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్రను టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేటీఆర్, హరీశ్‌రావు శకం గతమని.. అధికారం పోయిందన్న అక్కసుతో వారిద్దరూ అడ్డగోలుగా మాట్లాడుతున్నారని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి.. బావాబామ్మర్దులకు నచ్చడం లేదని మహేష్ విమర్శించారు. వచ్చే ఎన్నికల్లో 100 సీట్లు తగ్గకుండా మళ్లీ అధికారంలోకి వస్తామని ధీమా వ్యక్తం చేశారు. 1 లక్ష 78 వేల కోట్ల రూపాయల విదేశీ పెట్టుబడులు తీసుకొచ్చామని తెలిపారు. ఫ్యూచర్ సిటీని మొదలు పెట్టి 5 లక్షల 78 వేల కోట్ల పెట్టుబడులు తీసుకొచ్చామని చెప్పారు. బస్సు యాత్ర ముగింపు కార్యక్రమానికి ప్రియాంక గాంధీని తీసుకువచ్చే ప్రయత్నం చేస్తామని మహేష్ కుమార్ గౌడ్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కాంగ్రెస్ లంబాడ ఎమ్మెల్యేలు, ఎంపీలు హాజరయ్యారు.

# గతాన్ని మరచి పోండి..అలాంటి పొరపాట్లు జరగవు

(మొదటి పేజీ తరువాయి)

ప్రార్థిస్తున్నానని అన్నారు. చేవెళ్ల నియోజకవర్గ బీఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం, ఎస్ఐఆర్ శిక్షణా కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడుతూ.. గతంలో లాగా చిన్నచిన్న పొరపాట్లు జరుగకుండా చూసుకుంటమని నేను మీకు మాటిస్తున్నానన్నారు. వాస్తవానికి మొత్తం ప్రభుత్వం మీద దృష్టి పెట్టినం.. పార్టీ మీద ఎక్కువ దృష్టి పెట్టలేదు. కొత్త రాష్ట్రం, కొత్త సంసారం కాబట్టి పునాది గట్టిగా పడాలి అని.. మన రాష్ట్రం నవ్వే వాళ్ళ ముందు జారిపడొద్దని.. మీకు పరిపాలన చేతనైతదా అన్నోళ్లను నోళ్లు మూయించాలే.. మంచిగా నడిపించాలని ఆలోచన చేసాం తప్ప వేరే ఆలోచన చేయలేదని అన్నారు. ఒక సైనికుడు శాంతి సమయంలో ఎంత చెమట చిందిస్తే, యుద్ధంలో అంత తక్కువ రక్తం కారుతుంది. మీ ఈ టైంలో పార్టీని బందబస్తుగా నిర్మాణం చేసుకుంటే రేపు ఎన్నికలు వచ్చినంక ఆగమాగమయ్యే బాధ తప్పుతది.. మీకు ఐడీ కార్డు వస్తది.. ఆ ఐడీ కార్డు రేపు మన ప్రభుత్వం వచ్చినంక జేబులో పెట్టుకొని పోతే ఆ ఆఫీసర్ అయినా పోలీసోడు అయినా కేసీఆర్ మనిషి వచ్చిండు పని చేయాలని మీకు గౌరవమిచ్చి పనిచేసే పరిస్థితి ఉంటది. మంచి ఐడీ కార్డు తయారుచేసి ప్రతీ కార్యకర్తకు ఇస్తం. మిమ్మల్ని రాబోయే 5 సంవత్సరాలు మాత్రం గతంలో జరిగిన పొరపాట్లు మళ్లీ జరుగకుండా ఉద్యమ కారులను కానీ, కార్యకర్తలను కానీ కడుపులో పెట్టుకొని చూసుకునే బాధ్యత తీసుకుంటానన్నారు. ప్రభుత్వం లేదు.. పవర్ లేదు కానీ గర్వంగా ఎక్కడనిపిస్తుందంటే ఎమ్మెల్యే పోయినా.. ఎంపీ పోయినా.. అధికారం పోయినా ఇంతమంది సోదరులు ఇక్కడికొచ్చి మీరు చేస్తున్న ప్రకటన మామూలు ప్రకటన కాదు.. ఇది కాంగ్రెస్, బీజేపీ పార్టీ గుండెల్లో రైళ్లను ఉరికించే గొప్ప దృశ్యం ఇక్కడ కనిపిస్తుందని చేవెళ్ల సమావేశాన్ని ఉద్దేశించి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. మీ అందరికీ తెలుసు మనకు అధికారం పోయి రెండున్నరేళ్లయింది. ఎన్నికల ముందేమో నేను గుంపు మేస్త్రీని. రియల్ ఎస్టేట్ అంటేనే రేవంత్ రెడ్డి.. రేవంత్ రెడ్డి అంటేనే రియల్ ఎస్టేట్ అని ఫోజులు కొట్టిండు. ఇవాళ రియల్ ఎస్టేట్‌ను ఏం చేసిండు మరి.. బొంద పెట్టిండు.. వంద ఫీట్ల అడుగులో పాతిపెట్టే పని చేసిండని మండిపడ్డారు.మన ప్రభుత్వం, పెద్దలు కేసీఆర్ ఉన్నప్పుడు షాబాద్‌లో చందన్ వెల్లిలోకానీ, సీతారాంపూర్‌లో కానీ ఎకరం 30 లక్షలుండేది. కానీ అక్కడ ఇండస్ట్రియల్ పారిశ్రామిక పార్క్ తీసుకొచ్చిన తర్వాత అక్కడ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన కంపెనీలు ఒక మైక్రోసాఫ్ట్, అమెజాన్ వెల్స్‌ఫన్ ఇతర కంపెనీలు తీసుకొచ్చిన తర్వాత నేడు ఎకరం 3 కోట్లకు తక్కువ షాబాద్‌లో లేని పరిస్థితి ఉంది. అదే రేవంత్ రెడ్డి వచ్చిన తర్వాత లక్షల మంది రియల్ ఎస్టేట్ మీద ఆధారపడి పనిచేసుకునే తమ్ముళ్లు, చెల్లెళ్లందరూ ఇవాళ దివాళా తీసే పరిస్థితి వచ్చిందన్నారు. వాస్తవేంటంటే ఎన్నికలకు ముందు ఎకరం కోటి రూపాయలు పలికింది కూడా ఇవాళ కనీసం రూ.50 లక్షలు, రూ.60 లక్షలకు కూడా కొనేందుకు ఎవరూ సిద్ధంగా లేరన్నారు. దారుణమైన పరిస్థితి ఉంది. ఎందుకీ పరిస్థితి ఉందనేది మనం ఆలోచన చేసుకోవాల్సి ఉందని కేటీఆర్ గుర్తు చేశారు.

# పేదల జీవనోపాధికి ఇబ్బంది లేకుండా ఇళ్లు

(మొదటి పేజీ తరువాయి)

హౌసింగ్, సమాచార / పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనలకు అనుగుణంగా పేదల ఉపాధి, పిల్లల చదువు, కుటుంబ జీవన వ్యవస్థ దెబ్బతినకుండా నియోజకవర్గాన్ని యూనిట్ గా తీసుకొని వారు నివశిస్తున్న ప్రాంతాలలోనే వారికి గౌరవప్రదమైన నివాసం కల్పించడమే తమ ప్రభుత్వ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. గురువారం సచివాలయంలోని తన కార్యలయంలో క్యూర్ పరిధిలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం, ఆర్‌డీఓ, తహసీల్దార్ కార్యాలయాల శాశ్వత భవనాల నిర్మాణం, భద్రాచలం దేవస్థానం అభివృద్ధి అంశాలపై అధికారులతో మంత్రి సమీక్షించారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఈ ఏడాది క్యూర్ పరిధిలో లక్ష ఇండ్ల నిర్మాణం లక్ష్యంగా పెట్టుకున్నామని, ప్రయోగాత్మకంగా తొలి విడతలో ప్రతి నియోజకవర్గానికి 500 చొప్పున ఇళ్లు నిర్మించనున్నట్లు తెలిపారు. క్యూర్ పరిధిలోని 26 నియోజకవర్గాల్లో ఇప్పటికే దాదాపు 20 వరకు స్థలాలను గుర్తించామని, మిగిలిన ప్రాంతాల గుర్తింపు పక్రియను వేగవంతం చేసి ఈ నెల 28వ తేదీ లోగా అన్ని లొకేషన్లను ఖరారు చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే ప్రతి స్థలానికి సంబంధించిన ప్రణాళికలు, డిజైన్లు, నిర్మాణ నమూనాలను కూడా జూన్ 28లోగా సిద్ధం చేయాలని, ఇందిరమ్మ ఇండ్లకు సంబంధించిన విధివిధానాలు, అర్హతలు, దరఖాస్తు పక్రియ వివరాలతో కూడిన బ్రోచర్‌ను జూలై మొదటి వారంలో విడుదల చేస్తామని వెల్లడించారు. క్యూర్ పరిధిలో అత్యంత ముఖ్యమైన్ ప్రాంతాలల్లో కోట్ల రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూముల్లో ఇండ్ల నిర్మాణాలను చేపడుతున్నామని ఈ స్థలాల్లో అన్ డివైడెడ్ షేర్ క్రింద మహిళలకు వాటా కల్పిస్తూ ఆ భాగాన్ని మహిళల రిజిస్ట్రేషన్ చేస్తామని మరోమారు స్పష్టం చేశారు. రాష్ట్రంలో హౌసింగ్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఒకే మోడల్ లో ఆర్.డి.ఓ., తహశీల్దార్ కార్యాలయాలకు శాశ్వత భవనాలను నిర్మిస్తున్నామని తెలిపారు.

ఆయా జిల్లాల కలెక్టర్లతో సమన్వయం చేసుకొని వీలైనంత త్వరితగతిన పనులు ప్రారంభించేలా ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని ఆదేశించారు.

అలాగే, ఆర్.డి.ఓ. తహశీల్దార్ కార్యాలయాల భవనాల మరమ్మతులకు సంబంధించి హౌసింగ్ ఏ.ఈ. లు భవనాలను విజిట్ చేసి ప్రతిపధనలు పంపించాలని సూచించారు.

# ప్రత్యేక ఓటరు జాబితా సవరణపై క్షేత్రస్థాయి పరిశీలన

### ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ, వివరాల సేకరణ వేగవంతం చేయాలని బీఎల్ఓలకు సూచనలు: సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్





**కల్లూరు, జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**కల్లూరు మండలంలోని గోకవరం గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ మరియు ఓటర్ల వివరాల సేకరణ ప్రక్రియను సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ఓటర్ల వివరాలను సేకరించడం, ఎన్యూమరేషన్ ఫారాలను పంపిణీ చేయడం, అర్హులైన ప్రతి ఓటరికి ఫారాలు అందజేయడం వంటి అంశాలపై బూత్ లెవల్ అధికారులు (బీఎల్ఓలు)కు అవసరమైన సూచనలు చేశారు. కార్యక్రమం అమలవుతున్న తీరును ప్రత్యక్షంగా పరిశీలించి, ప్రక్రియలో ఎలాంటి లోపాలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడిన సబ్ కలెక్టర్, ఎన్యూమరేషన్ ఫారాలను పూర్తిగా నింపి సంబంధిత బీఎల్ఓలకు అందజేయాలని కోరారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియలో ప్రజలు చురుకుగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించుకోవడం ద్వారా ఎన్నికల వ్యవస్థ మరింత పారదర్శకంగా, సమగ్రంగా నిర్వహించబడుతుందని తెలిపారు. గ్రామంలో జరుగుతున్న కార్యక్రమాల పురోగతిని సమీక్షించిన అధికారులు, నిర్ణీత గడువులోగా ఎన్యూమరేషన్ ప్రక్రియను పూర్తి చేయాలని బీఎల్ఓలు, సంబంధిత సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు.

# జర్నలిస్టుల సమస్యలపై 'ఛలో హైదరాబాద్'

### ● రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈదునూరి మహేష్



**వరంగల్, జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** ఈనెల 29న హైదరాబాద్ ఐ.అండ్.పి.ఆర్ కమిషనర్ కార్యాలయం ముట్టడిని దళిత, గిరిజన జర్నలిస్టులతో పాటు సామాజికవాదులు అధిక సంఖ్యలో పాల్గొని, కార్యాక్రమాన్ని విజయవంతం చేయాలని తెలంగాణ ఎస్సి,ఎస్టి వర్కింగ్ జర్నలిస్టుల అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షులు ఈదునూరి మహేష్ పిలుపునిచ్చారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ...రాష్ట్రంలో అక్రిడిటేషన్ల విషయంలో దళిత, గిరిజన జర్నలిస్ట్ లపై సామాజిక వివక్షతను చూపడంతో కార్డుల పంపిణిలో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడిటేషన్ కమిటీలలో ఇతర సామాజిక వర్గాల ఆధిపత్యం కొనసాగిస్తూ దళిత, గిరిజన జర్నలిస్టులను పక్కన పెట్టే విధానాన్ని తక్షణమే విరమించాలని, అర్హులైన ఎస్సీ, ఎస్టీ జర్నలిస్టులకు వెంటనే అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం నుండి ఇప్పటి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. అదేవిదంగా దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు అక్రిడిటేషన్ కమిటీలలో స్థానం కలిగించినప్పుడే దళిత, గిరిజన జర్నలిస్ట్ లకు న్యాయం జరుగుతోందని, దళిత,గిరిజన జర్నలిస్ట్ లకు రాష్ట్ర ప్రభుత్వం ద్వారా అందించే సంక్షేమ పథకాలలో మొదటి ప్రాధాన్యత ఇస్తూ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల్లో చదువుకుంటున్న దళిత, గిరిజన జర్నలిస్టుల పిల్లలకు నూరుశాతం రాయితీ ప్రకటించాలని కోరారు. అనంతరం ముట్టడి కార్యక్రమానికి దళిత, గిరిజన జర్నలిస్టులు, దళిత, గిరిజన సంఘాలు, ప్రజాసంఘాలు, సామాజిక న్యాయవాదులు తమ మద్దతును ప్రకటించి, పెద్ద ఎత్తున పాల్గొని, కార్యాలయం ముట్టడిని విజయవంతం చేయాలని తెలిపారు.

# సమస్యలపై పోరాటానికి సిద్ధం: కల్వకుంట్ల కవిత

### ఘనంగా అంబర్‌పేటలో టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగ

### యువత రాజకీయాల్లోకి రావాలి

### కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలను నెరవేర్చాలి

### పేద బడుగు బలహీన వర్గాలకు అండగా మేమున్నాం






**హైదరాబాద్ జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):**అంబర్ పేట నియోజకవర్గంలో మహంకాళి దేవాలయం ఎదురుగా టిఆర్ఎస్ పార్టీ జెండా పండుగకు తెలంగాణ రక్షణ సేన అధ్యక్షురాలు కవిత చేతుల మీదుగా జెండా ఎగురవేయడం జరిగింది. ఈ కార్యక్రమం ప్రవీణ్ ముదిరాజ్ ఇంచార్జ్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం పెద్ద ఎత్తులో నిర్వహించారు. అంబర్ పేట నియోజకవర్గం నాయకులు అభిలాష్ గౌడ్ మరియు హైమద్ అలీ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ రానున్న రానున్న గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ ఎలక్షన్లో టిఆర్ఎస్ పార్టీ జెండా ఎగరవేయడం ఖాయమని, బడుగు బలహీన వర్గాలకు అండగా మేమున్నామని, ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను నెరవేర్చాలని, ప్రజా సమస్యలపై పోరాటానికి మేము ఎప్పుడు సిద్ధంగా ఉన్నామని, యువత రాజకీయాల్లోకి రావాలని, ప్రజా సమస్యలపై పోరాటం చేస్తామని ముఖ్యంగా ఉచిత విద్య ఉచిత వైద్యం సామాజిక తెలంగాణ రైతుల సమస్యలపై పోరాటం చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో టిఆర్ఎస్ పార్టీ బహుదూర్ పుర ఇంచార్జ్ సోను భాయ్ టిఆర్ఎస్ పార్టీ నాయకులు కంటెస్టెడ్ ఎమ్మెల్యే నందాల అనిల్ కుమార్, రాజు, నిఖిల్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఘనంగా అన్వేష్ , శైలజ వివాహ వేడుక

### - మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ఆశీస్సులు





**సత్తుపల్లి, జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :**సత్తుపల్లి మండలం సదాశివునిపాలెం గ్రామానికి చెందిన కర్నాటి చిన్న కోటయ్య (లేటు) వెంకటలక్ష్మి దంపతుల కనిష్ట పుత్రుడు అన్వేష్, శైలజల వివాహ శుభకార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ వేడుకకు బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకట వీరయ్య ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.ఈ సందర్భంగా వధూవరులకు శుభాకాంక్షలు తెలియజేసి, వారి దాంపత్య జీవితం ఆనందంగా, ఆయురారోగ్యాలతో కొనసాగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వీరపనేని బాబి, వల్లభనేని పవన్, గ్రామ నాయకులు తుంబూరు దామోదర్ రెడ్డి, మందపాటి సూర్యప్రకాశ్ రెడ్డి, కర్నాటి భద్రం, దుబ్బాక చందు, ఆళ్ళ రమేష్, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.

# ఓటరు సర్వేకు ప్రజలు సహకరించాలి: తహసీల్దార్

### 31వ డివిజన్‌లో ఇంటింటి సర్వే

**హనుమకొండ, జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):**న్యూశాయంపేటలో ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు గురువారం 'స్పెషల్ ఇంటెన్స్ రివిజన్ (SIR)-2026' (ప్రత్యేక ఓటర్ల సవరణ కార్యక్రమం) లాంఛనంగా ప్రారంభమైంది. స్థానిక తహసీల్దార్ చాలమల్ల రాజు ఈ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వంద శాతం స్వచ్ఛమైన, దోషరహితమైన ఓటర్ల జాబితాను రూపొందించడమే ఈ కార్యక్రమ ముఖ్య లక్ష్యమని స్పష్టం చేశారు.ఇందులో భాగంగా బూత్ లెవెల్ ఆఫీసర్లు (బీఎల్‌వోలు) ఇంటింటి సర్వే నిర్వహించి వివరాలను ధృవీకరిస్తారని తెలిపారు. కొత్త ఓటర్ల నమోదు, మరణించిన లేదా వలస వెళ్లిన వారి పేర్ల తొలగింపు, చిరునామాలు, ఫోటోల సవరణ వంటి ప్రక్రియలు చేపట్టనున్నట్లు వివరించారు. 2026 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు చేసుకోవాలని, ప్రజలంతా బీఎల్‌వోలకు సహకరించి సరైన సమాచారం అందించాలని తహసీల్దార్ కోరారు. **31వ డివిజన్‌లో ముమ్మరంగా సర్వే** ఈ కార్యక్రమంలో భాగంగా 31వ డివిజన్‌లో తాజా మాజీ కార్పొరేటర్ మామిండ్ల రాజు ఆధ్వర్యంలో బీఎల్‌వోలతో కలిసి ఇంటింటి సర్వే నిర్వహించారు. డీసీసీ సభ్యులు మామిండ్ల సురేష్ మాట్లాడుతూ.. ప్రజాస్వామ్యానికి పునాది అయిన ఓటు హక్కును ప్రతి అర్హుడికి కల్పించేందుకు కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. 18 ఏళ్లు నిండిన ప్రతి యువతీ యువకుడిని ఓటరుగా నమోదు చేయించే బాధ్యత తమపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ సూపర్ వైజర్ సుదర్శన్, బీఎల్‌వో విజయ, డివిజన్ అధ్యక్షుడు సురేందర్, టిడిపి నాయకులు కుసుమ శ్యామ్, పాతిమచారి, కాంగ్రెస్ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# హబ్సిగూడ డివిజన్లో ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం





**ఉప్పల్ జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**హబ్సిగూడ డివిజన్ పరిధిలోని బూత్ నెంబర్ 249 గ్యాన్ భారతి హై స్కూల్ పరిధిలో ఓటర్ నమోదు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఓటర్లకు ఫామ్ 6 పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉప్పల్ ఇంచార్జ్ ఉప కమిషనర్ శైలజ, రామ్ రెడ్డి, బూతు బిఎల్ఓ శివ, భారతీయ జనతా పార్టీ శక్తి కేంద్రం ఇంచార్జ్ జిల్లాల రవీందర్ రెడ్డి, హబ్సిగూడ డివిజన్ ప్రధాన కార్యదర్శి బిఎల్ఓ2 చింతకింది ప్రవీణ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలుసుకొని కొత్త ఓటర్ నమోదు వివరాల సవరణ మరియు ఓటు హక్కు ప్రాధాన్యత పై అవగాహన కల్పించారు. అర్హులైన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకొని ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు.

# ఉద్యోగం ఇప్పిస్తానని ఆరు లక్షలు మోసం

### - న్యాయం చేసి డబ్బులిప్పించాలని బాధితుల వేడుకోలు




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** అబ్రాడ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆరు లక్షల వరకు వసూలు చేసి, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరిస్తున్న సలీం అనే వ్యక్తిపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని బాధితుడు సోందుమియా ఆవేదన వ్యక్తం చేశాడు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోందుమియా మాట్లాడుతూ.. ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన ఇమామ్ కొడుకు సలీం కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నాడని, తమకు తెలిసిన ఏజెన్సీకి డబ్బులు చెల్లిస్తే అబ్రాడ్ వెళ్లవచ్చని నమ్మబలికినట్లు తెలిపారు. తన అల్లుళ్లకు ఉద్యోగం వస్తుందనే ఆశతో సలీం చూపించిన కన్సల్టెన్సీ వారి ఖాతాకు తన సతీమణి పేరుతో ఎస్‌బిఐ బ్యాంక్ నుండి దఫాల వారీగా గబుదాబీ కమర్షియల్ బ్యాంక్ ఖాతా నెంబర్ఏ ఇ310030000499477208001కు ఇద్దరికి చొప్పున ఆరు లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఆరు నెలలైనా ఉద్యోగం ఇవ్వకపోవడంతో తమ డబ్బులు ఇవ్వాలని అడుగగా తనకు ఇవ్వలేదు, కన్సల్టెన్సీ వారిని అడగండి అంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు. కన్సల్టెన్సీ వారిని అడుగగా తమకేం సంబంధం లేదని, సలీంను అడగాలని చెప్పినట్లు తెలిపారు. ఇటీవలనే సలీమ్ ఖమ్మంవచ్చాడని, తాము నిలదీయగా మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమను మోసం చేసిన సలీమ్‌తో పాటు అతని తండ్రి ఇమామ్‌పై చర్యలు తీసుకుని తమ డబ్బుల్ని తమకు ఇప్పించాలని వేడుకున్నాడు. లేకుంటే తనకు చావే గతి అని, తాను వడ్డీకి అప్పుతెచ్చి డబ్బులు ఇచ్చినట్లు వాపోయాడు. ఈ సమావేశంలో సోందుమియా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# 40వ బూతులో సర్ ప్రత్యేక కార్యక్రమం నిర్వహణ



**పరకాల,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** పరకాల పట్టణంలోని 40వ బూత్ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం (సర్) నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పరకాల ఎంఆర్వో తోట విజయలక్ష్మి పాల్గొని ఓటర్లకు ఎన్నికల జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా గ్రామ పంచాయతీ అధికారి ఎస్.డీ. షకీర్, బూత్ లెవెల్ అధికారి అల్లం సాంబయ్య ఓటర్ల వివరాలను పరిశీలించి అవసరమైన సూచనలు అందించారు.కార్యక్రమంలో బీజేపీ పార్టీ బీఎల్ఏ ప్రతినిధి, 15వ వార్డు కౌన్సిలర్ కుక్కల విజయ్ కుమార్ పాల్గొని ఓటర్ల సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు.ఓటరు జాబితాలో పేరు నమోదు, సవరణలు, తొలగింపులకు సంబంధించిన ఫారం-6, ఫారం-7, ఫారం-8 దరఖాస్తులను అధికారులు అక్కడికక్కడే స్వీకరిం చారు. కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, ఓటరు జాబితాలో పేరు నమోదు కాని అర్హులైన పౌరులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంఆర్వో తోట విజయలక్ష్మి సూచించారు.ఈ కార్యక్రమంలో పలువురు ఓటర్లు, ప్రజాప్రతినిధులు మరియు ఎన్నికల సిబ్బంది పాల్గొన్నారు.

# మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్‌పై దుష్ప్రచారం మానుకోవాలి

**రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నమోదు చేస్తున్న ప్రత్యేక ఓటర్ జాబితా సవరణ పై రాష్ట్ర మంత్రి కె విశ్వాసం లేకపోతే ఎలా**

**బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు సింగిరెడ్డి కృష్ణారెడ్డి**



**చొప్పదండి జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** చొప్పదండి నియోజకవర్గం లో నేడు బూత్ లెవల్ అధికారులు ఓటర్ల గృహాలు సందర్శించి వారికి ఎస్ఐఆర్ ఫారంలు అందిస్తూ అవగాహన కల్పించారు. చొప్పదండి మండలం రాగంపేట గ్రామంలో బిజెపి కిసాన్ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు రాగంపేట తాజా మాజీ ఎంపీటీసీ సింగిరెడ్డి కృష్ణారెడ్డి తన కుటుంబ సభ్యుల యొక్క ఎస్ఐఆర్ ఫారంలు నింపి అధికారులకు తిరిగి అందజేశారు. ఈ సందర్భంగా సింగిరెడ్డి కృష్ణారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ ఎస్ఐఆర్ వల్ల ఓట్లు పోతాయని ఇటీవల ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. ద్వితీయ శ్రేణి కాంగ్రెస్ నాయకులు ఎస్ఐఆర్ కార్యక్రమాలలో ఉత్సాహంగా పాల్గొంటూ ఉంటే కేవలం బంగ్లాదేశీ రోహింగ్యాల ఓట్లు కాపాడటం కోసం కోసం పొన్నం ప్రభాకర్ చౌకబారు విమర్శలు చేస్తున్నారని దుయ్యబట్టారు, మహారాష్ట్రలో ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ నాయకులు గవర్నర్ ను, మహారాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారిని కలిసి ఎస్ఐఆర్ మరింత పటిష్టంగా అమలు చేయాలని విజ్ఞప్తి చేశారని చేశారు. కేరళలో డూప్లికేట్ ఓట్లు తగ్గిపోవడం వలన కాంగ్రెస్ పార్టీకి మేలు జరిగిందని శశి థరూర్ పేర్కొన్నారని సుప్రీంకోర్టు ఎస్ఐఆర్ ను సమర్థిస్తూ కాంగ్రెస్ పార్టీ నాయకులు వేసిన పిటిషన్లు కొట్టి వేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఇప్పటివరకు దేశవ్యాప్తంగా జరిగిన ఏస్ఐఆర్ లో ఏ ఒక్క అర్హుడైన ఓటర్ తన ఓటు కోల్పోయిన దాఖలా లేదని కేవలం మరణించిన వారివి, మరియు రెండు సార్లు నమోదు అయిన డూప్లికేట్ ఓట్లు మాత్రం తగ్గుతాయని ఈ సందర్భంగా ఆయన వివరించారు. అంతేకాక ఎస్ఐఆర్ లో పాల్గొనే ఎన్నికల అధికారులు బిఎల్వోలు సూపర్వైజర్లు, మండల డివిజనల్ జిల్లా స్థాయి ఎన్నికల అధికారులు పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని, వీరు ఎన్నికల కమిషన్ నిబంధనల ప్రకారం పని చేస్తున్నప్పటికీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులని మరి రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు నమోదు చేసే ఓట్లపైన రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ కే విశ్వాసం లేకపోవటం విడ్డూరమని సింగిరెడ్డి కృష్ణారెడ్డి ఎద్దేవా చేశారు. కార్యక్రమంలో చొప్పదండి బిజెపి అసెంబ్లీ కన్వీనర్ పెరుక శ్రావణ్ కుమార్, గుండె వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు

---

# మీడియా మిత్రుడు సుమన్ తండ్రి మృతికి నివాళి

- పేరువంచలో కుటుంబ సభ్యులను పరామర్శించిన సర్పంచ్ నిర్మల, మోహన్ రెడ్డి





**కల్లూరు, జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :**మండల పరిధిలోని పేరువంచ గ్రామం ఎన్టీఆర్ కాలనీలో అనారోగ్య కారణాలతో మృతి చెందిన తాళ్లూరి సుందర్‌రావుకు గ్రామ పంచాయతీ సర్పంచ్ కీసర నిర్మల, కీసర మోహన్‌రెడ్డి ఘనంగా నివాళులర్పించారు. గురువారం ఆయన నివాసానికి వెళ్లిన వారు పార్థివ దేహంపై పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించి వారి యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముఖ్యంగా మృతుడి కుమారుడు, మీడియా మిత్రుడు తాళ్లూరి సుమన్‌ను ఓదార్చి ధైర్యం చెప్పారు. సుందర్‌రావు మరణం కుటుంబానికి తీరని లోటని పేర్కొంటూ, ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. సుందర్‌రావు గ్రామంలో సౌమ్య స్వభావం కలిగిన వ్యక్తిగా అందరి అభిమానాన్ని సంపాదించుకున్నారని, ఆయన మరణ వార్త గ్రామ ప్రజలను విషాదంలో ముంచిందని తెలిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, ఈ కష్ట సమయంలో వారికి అండగా ఉంటారని భరోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, బంధుమిత్రులు, స్థానికులు పాల్గొని సుందర్‌రావుకు నివాళులర్పించారు.

---

# రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు మృతి - బాధిత కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం

**మృతుల కుటుంబాలకు ఒక్కొక్కరికి రూ.10,000 ఆర్థిక సాయం, ఉచిత అంబులెన్స్‌ల ఏర్పాటు**

**లంకెదాసరి మల్లయ్య, గుంట మహేష్ మృతి పట్ల ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తీవ్ర దిగ్భ్రాంతి - అండగా ఉంటానని హామీ**

**రోడ్డు ప్రమాద బాధిత కుటుంబాలను పరామర్శించిన చొప్పదండి ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం**







**కరీంనగర్ జిల్లా జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో మృతిచెందిన ఇద్దరి కుటుంబ సభ్యులను చొప్పదండి ఎమ్మెల్యే, కరీంనగర్ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు డాక్టర్ మేడిపల్లి సత్యం నేడు కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రిలో పరామర్శించారు. మృతుల కుటుంబాలకు తనవంతుగా ఒక్కొక్కరికి రూ. 10,000 చొప్పున ఆర్థిక సహాయం అందించి, ప్రగాఢ సానుభూతి తెలిపారు. గంగాధర మండలం, ఉప్పర మల్యాల గ్రామానికి చెందిన లంకెదాసరి మల్లయ్య (55) ఈ నెల 10వ తేదీన ద్విచక్ర వాహనంపై వెళ్తుండగా ట్రాక్టర్ ఢీకొట్టింది. తీవ్ర గాయాలపాలైన ఆయనను చికిత్స నిమిత్తం కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా, 10 రోజులు మృత్యువుతో పోరాడి నేడు చికిత్స పొందుతూ మృతిచెందారు. చొప్పదండి మండలం, ఆర్నకొండకు చెందిన గుంట మహేష్ రహదారిపై నడుచుకుంటూ వెళ్తుండగా, వెనుక నుండి వేగంగా వచ్చిన టాటా ఏస్ వాహనం ఢీకొట్టింది. స్థానికులు వెంటనే మహేష్‌ను కరీంనగర్ సివిల్ ఆస్పత్రికి తరలించగా, తీవ్ర గాయాల కారణంగా చికిత్స పొందుతూ నేడు తుదిశ్వాస విడిచారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే డాక్టర్ మేడిపల్లి సత్యం హుటాహుటిన కరీంనగర్ ప్రభుత్వ ఆసుపత్రికి చేరుకుని మృతులు లంకెదాసరి మల్లయ్య, గుంట మహేష్ కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారి మృతి పట్ల తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఇరు కుటుంబాలకు తక్షణ సహాయంగా ఒక్కో కుటుంబానికి రూ. 10,000 చొప్పున ఆర్థిక సాయం అందించారు. అంతేకాకుండా మృతదేహాలను స్వగ్రామాలకు తరలించేందుకు ఉచిత అంబులెన్సును ఏర్పాటు చేసినారు. "ఈ కష్ట సమయంలో మీకు కాంగ్రెస్ పార్టీ, నేను ఎల్లప్పుడూ అండగా ఉంటాం. ధైర్యంగా ఉండండి. ప్రభుత్వం నుండి రావాల్సిన అన్ని రకాల సహాయ సహకారాలు అందేలా చూస్తాను" అని మృతుల కుటుంబాలకు ఎమ్మెల్యే గారు భరోసా ఇచ్చారు. మేడిపల్లి సత్యంతో పాటు చొప్పదండి, గంగాధర కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు వృత్తుల కుటుంబాలను పరామర్శించారు.

---

# అంగరంగ వైభవంగా ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు

**- రిబ్బన్ కట్ చేసి ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ ధారావత్ మోహన్**





**కల్లూరు, జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్)** :కల్లూరు మున్సిపాలిటీ పరిధిలోని కిష్టయ్య బంజర గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కల్లూరు మున్సిపాలిటీ చైర్మన్ ధారావత్ మోహన్ రిబ్బన్ కట్ చేసి గృహ ప్రవేశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద కుటుంబాలకు గౌరవప్రదమైన నివాస సౌకర్యం కల్పించాలనే లక్ష్యంతో ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి అర్హ కుటుంబానికి సొంత ఇంటి కల నెరవేర్చేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ఈ కార్యక్రమంలో కల్లూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ భాగం నీరజా ప్రభాకర్, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు, ఆర్యవైశ్య జిల్లా అధ్యక్షులు పసుమర్తి చంద్రరావు, కల్లూరు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పోట్రు అర్జున్‌రావు, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు షేక్ ఉస్మాన్, కల్లూరు మున్సిపల్ కమిషనర్ సాయి కృష్ణారెడ్డి, మేనేజర్ నందిశెట్టి నాగేశ్వరరావు పాల్గొన్నారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కౌన్సిలర్లు యాసా నాగమణి శ్రీకాంత్, ఉబ్బన రాంబాబు, నోటి కృష్ణారెడ్డి, జంగం నరసింహారావు, బైర్ల కాంతారావు తదితరులు హాజరయ్యారు. గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

---

# దేశంలో 23వ ర్యాంకు సాధించిన ఓద్యారం పాఠశాల... గర్వంగా ఉందన్న ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం




**రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయికి... ఓద్యారం విజయయాత్రకు ఎమ్మెల్యే అభినందనలు**



**గంగాధర జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** తన చొప్పదండి నియోజకవర్గంలోని గంగాధర మండలానికి చెందిన జడ్‌పీహెచ్‌ఎస్ ఓద్యారం SHVR-2025-26 జాతీయ స్థాయి రేటింగ్‌లో దేశంలో 23వ ర్యాంకు, తెలంగాణలో 5వ ర్యాంకు సాధించిన సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయ బృందాన్ని ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం తన క్యాంపు కార్యాలయానికి ఆహ్వానించి అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, జాతీయ స్థాయిలో గుర్తింపు సాధించడం గంగాధర మండలానికే కాకుండా మొత్తం చొప్పదండి నియోజకవర్గానికి గర్వకారణమని పేర్కొన్నారు. ప్రభుత్వ పాఠశాలలు దేశ భవిష్యత్తుకు పట్టుకొమ్మల వంటివని, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులే రేపటి సమాజ నిర్మాణంలో కీలక పాత్ర పోషిస్తారని అన్నారు. 2017-18లో పాఠశాల రాష్ట్ర స్థాయి అవార్డు సాధించినప్పుడు కూడా తాను ఎంతో సంతోషించానని, ఇప్పుడు అదే పాఠశాల జాతీయ స్థాయిలో గుర్తింపు పొందడం మరింత ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. ఒక చిన్న గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల దేశవ్యాప్తంగా గుర్తింపు పొందడం అభినందనీయమని కొనియాడారు. జడ్‌పీహెచ్‌ఎస్ ఓద్యారం ఉపాధ్యాయులు, విద్యార్థు లు, తల్లిదండ్రులు, గ్రామస్థులు సమిష్టిగా కృషి చేయడం వల్లే ఈ అద్భుత విజయం సాధ్యమైందని పేర్కొన్నారు. పరిశుభ్రత, పచ్చదనం, పర్యావరణ పరిరక్షణ, నాణ్యమైన విద్య అందించడంలో పాఠశాల చూపుతున్న కృషి ఇతర పాఠశాలలకు ఆదర్శంగా నిలుస్తోందని తెలిపారు. పాఠశాల బృందానికి ఆయన ప్రత్యేక అభినందనలు తెలియజేసి, భవిష్యత్తులో మరిన్ని జాతీయ స్థాయి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థుల ప్రతినిధులు పాల్గొన్నారు. "రాష్ట్ర స్థాయి గుర్తింపు ఆనందాన్ని ఇచ్చింది... జాతీయ స్థాయి విజయం గర్వాన్ని కలిగించింది. ప్రభుత్వ పాఠశాలలే దేశానికి నిజమైన పట్టుకొమ్మలు" అని ఎమ్మెల్యే డా. మెడిపల్లి సత్యం పేర్కొన్నారు.

---

# పరకాల సబ్ జైలులో ఖైదీలతో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ



**పరకాల, జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):**మాదకద్రవ్యాల వినియోగ నిర్మూలనపై అవగాహన కల్పించేందుకు పరకాల సబ్ జైలులో గురువారం ఖైదీలందరితో మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పరకాల పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ క్రాంతి కుమార్ హాజరై ఖైదీలకు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సబ్ జైలు సూపరింటెండెంట్ ఎన్. ప్రభాకర్ రెడ్డి, జైలు సిబ్బంది, ఖైదీలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఇన్‌స్పెక్టర్ క్రాంతి మాట్లాడుతూ మాదకద్రవ్యాల వినియోగం యువత భవిష్యత్తును దెబ్బతీస్తుందని, సమాజానికి తీవ్ర హాని కలిగిస్తుందని అన్నారు. డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన జీవనం గడపాలని సూచించారు. సూపరింటెండెంట్ ఎన్. ప్రభాకర్ రెడ్డి మాట్లాడుతూ జైలు నుండి విడుదలైన తర్వాత కూడా మాదకద్రవ్యాలకు దూరంగా ఉండి, సమాజంలో గౌరవప్రదమైన జీవితాన్ని గడపాలని ఖైదీలకు సూచించారు. కార్యక్రమం ముగింపులో ఖైదీలు మాదకద్రవ్యాలను వినియోగించబోమని, ఇతరులను కూడా వాటికి దూరంగా ఉండేలా చైతన్యం కల్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు.

# ఆగస్టు మొదటివారం నాటికి యాతాలకుంట టన్నెల్ పనులు పూర్తి చేయాలి: జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్

### వచ్చే వర్షాకాలానికే బేతుపల్లి చెరువుకు గోదావరి జలాలు చేరాలి

### ఉమ్మడి ఖమ్మం జిల్లాకు సీతారామ ద్వారా గోదావరి సాగునీరు సరఫరా

### యాతాలకుంట టన్నెల్ లోపలికి వెళ్లి పనుల పురోగతిని పరిశీలించిన ఉమ్మడి జిల్లాల కలెక్టర్లు

**కల్లూరు, జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులో కీలక భాగమైన యాతాలకుంట టన్నెల్ నిర్మాణం, లైనింగ్ పనులను ఆగస్టు మొదటివారం నాటికి పూర్తిచేసి గోదావరి జలాలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ అధికారులను ఆదేశించారు. గురువారం సత్తుపల్లి మండల పరిధిలో నిర్మాణంలో ఉన్న యాతాలకుంట టన్నెల్‌ను భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్‌తో కలిసి జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్ సందర్శించారు. టన్నెల్ లోపలికి నడుచుకుంటూ వెళ్లి పనుల పురోగతి, లైనింగ్ నిర్మాణం, భద్రతా ప్రమాణాలు, నాణ్యత నియంత్రణ చర్యలను పరిశీలించారు. అనంతరం ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు, నిర్మాణ సంస్థ ప్రతినిధులతో సమీక్ష నిర్వహించి పనుల వేగంపై ఆరా తీశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ యాతాలకుంట టన్నెల్ నిర్మాణ పనులను ఆగస్టు మొదటివారం నాటికి పూర్తి చేసేలా కార్యాచరణ చేపట్టాలని అధికారులకు సూచించారు. యాతాలకుంట టన్నెల్ పూర్తి కావడం ద్వారా సత్తుపల్లి ట్రంక్ కాలువకు గోదావరి జలాలు చేరి సత్తుపల్లి నియోజకవర్గంలోని వేలాది ఎకరాలకు సాగునీరు అందే అవకాశం కలుగుతుందని తెలిపారు. టన్నెల్ పూర్తయిన వెంటనే రుద్రాక్షపల్లి, బేతుపల్లి ప్రాంతాలతో పాటు ఎన్టీఆర్ ప్రధాన కాలువకు నీటి సరఫరా సులభతరం అవుతుందని తెలిపారు.రాజీవ్ లింక్ కాలువ ద్వారా గోదావరి జలాలను వైరా ప్రాజెక్టుకు తరలించి ఆయకట్టు రైతులకు నీటి కొరత లేకుండా చేయాలన్నదే ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా ఖమ్మం జిల్లాతో పాటు భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో కూడా వ్యవసాయాభివృద్ధికి విశేష



అవకాశాలు ఏర్పడతాయని వివరించారు. యాతాలకుంట టన్నెల్ పూర్తయితే ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అదనంగా సుమారు లక్ష ఎకరాలకు సాగునీటి సౌకర్యం అందుబాటులోకి వస్తుందని కలెక్టర్ తెలిపారు. దీంతో రైతులు పంటలు సాగు చేసే అవకాశం కలుగుతుందని, వ్యవసాయ ఉత్పాదకతతో పాటు రైతుల ఆదాయం కూడా గణనీయంగా పెరుగుతుందని పేర్కొన్నారు.టన్నెల్ నిర్మాణ పనులు ప్రారంభమైన నాటి నుంచి ఇరిగేషన్ శాఖ అధికారులు, నిర్మాణ సంస్థ సిబ్బంది అంకితభావంతో పనిచేస్తున్నారని, మరింత వేగంపెంచి మిగిలిన లైనింగ్ పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని సూచించారు. రెండు వైపులా అదనపు యంత్రాలు, సిబ్బందిని వినియోగించి పనులను మరింత వేగవంతం చేయాలని ఆదేశించారు.పనుల అమలులో ఎదురయ్యే సాంకేతిక, పరిపాలనా లేదా ఇతర సమస్యలను వెంటనే ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని, ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్ణీత గడువు దాటకుండా పనులు పూర్తిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. వచ్చే వర్షాకాలానికే గోదావరి జలాలు బేతుపల్లి చెరువు, సత్తుపల్లి ఆయకట్టు ప్రాంతాలకు చేరేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ పనులను మరింత వేగవంతం చేసి ఆగస్టు లోపల పూర్తి చేసేలా కార్యాచరణ రూపొందించి అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించాలని సూచించారు.టన్నెల్ నిర్మాణ సమయంలో నీటి ప్రవాహానికి ఎటువంటి ఆటంకం కలగకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని, వర్షాకాల పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పనుల ప్రణాళిక రూపొందించాలని తెలిపారు. నిర్మాణ పనుల్లో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడరాదని, నిర్దేశిత సాంకేతిక ప్రమాణాలు, ఇంజినీరింగ్ నిబంధనలను పూర్తిస్థాయిలో పాటించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఇరిగేషన్ శాఖ టన్నెల్ అండ్ సేఫ్టీ కార్యదర్శి కల్నల్ పరిక్షిత్ మెహ్రా, చీఫ్ ఇంజనీర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. కృష్ణ, ఇంజినీరింగ్ సిబ్బంది, నిర్మాణ సంస్థ ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధూవరులకు మున్నూరుకాపు ప్రముఖుల ఆశీస్సులు

### - హరికుమార్‌ప్రియాంక దంపతులను ఆశీర్వదించిన సంఘం నేతలు



**సత్తుపల్లి,జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** నూతన వధూవరులు హరికుమార్ ప్రియాంకలను మున్నూరుకాపు ప్రముఖులు ఆశీర్వదించారు. సత్తుపల్లిలోని వీ. కన్వెన్షన్ హాలులో గురువారం నిర్వహించిన వివాహ విందు కార్యక్రమానికి పలువురు మున్నూరుకాపు సంఘం నాయకులు, ప్రముఖులు హాజరై నూతన దంపతులకు అక్షింతలు వేసి శుభాకాంక్షలు తెలిపారు.తోట వెంకట రంగారావునాగధరణి దంపతుల కుమారుడు హరికుమార్ వివాహం గుంటూరు వాస్తవ్యులు నర్సింగ్ భానుసింగ్‌నిర్మలాదేవి దంపతుల జ్యేష్ఠ కుమార్తె ప్రియాంకతో బుధవారం భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి దేవస్థానం సన్నిధిలో వైభవంగా జరిగింది. అనంతరం సత్తుపల్లిలోని వీ. కన్వెన్షన్ హాలులో కుటుంబ సభ్యులు వివాహ విందు ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి మున్నూరుకాపు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆకుల గాంధీ, మున్నూరుకాపు ప్రముఖులు, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పొదిల రవికుమార్, సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షులు శీలంశెట్టి వీరభద్రం, యువజన విభాగం అధ్యక్షులు తోట రమేష్, యర్రా శ్రీను, ఆకుతోట శేఖర్, హారిక పటేల్, వాకటి రమేష్, వనం శ్రీనివాస్, చౌడం నర్సింహారావు, ఆకుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# బోయినపల్లి కుమారుని పెళ్లికి ఎమ్మెల్యే హాజరు





**కరీంనగర్ జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** హైదరాబాద్ లోని జన్వాడ కె కన్వెన్షన్ హాల్లో గురువారం జరిగిన కరీంనగర్ మాజీ ఎంపీ బోయినపల్లి వినోద్ కుమార్ కుమారుని వివాహానికి టిపిసిసి ఎస్సీ సెల్ చైర్మన్, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన నూతన వధూవరులను ఆశీర్వదిస్తూ శుభాకాంక్షలు అందజేశారు. **పచ్చునూరులో...** మానకొండూర్ మండలం పచ్చునూరు గ్రామంలో కాంగ్రెస్ పార్టీ నాయకుడు సీత నాగరాజు కుమార్తె నూతన వస్త్రాలంకరణ కార్యక్రమంలో డా.కవ్వంపల్లి సత్యనారాయణ పాల్గొని శుభాశీస్సులు అందజేశారు. **చల్లూరులో...**వీణవంక మండలం చల్లూరులో జరిగిన తమ స్వగ్రామం పచ్చునూరుకు చెందిన కనకం అశోక్ కుమార్తె వివాహానికి మానకొండూర్ ఎమ్మెల్యే దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ, ఆయన సతీమణి డాక్టర్ కవ్వంపల్లి అనురాధ నూతన వధూవరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే మానకొండూర్ నియోజకవర్గంలోని పలు మండలాల్లో జరిగిన వివాహాది శుభకార్యాలకు డాక్టర్ దంపతులు హాజరయ్యారు.



# ఉద్యోగం ఇప్పిస్తానని మోసం... ఆరు లక్షలు వసూలు

### • న్యాయం చేసి డబ్బులిప్పించాలని బాధితుల వేడుకోలు

**ఖమ్మం, ప్రతినిధి జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** అబ్రాడ్‌లో ఉద్యోగం ఇప్పిస్తానని నమ్మబలికి ఆరు లక్షల వరకు వసూలు చేసి, ఇప్పుడు ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరిస్తున్న సలీం అనే వ్యక్తిపై చర్యలు తీసుకుని డబ్బులు ఇప్పించాలని బాధితుడు సోందుమియా ఆవేదన వ్యక్తం చేశాడు. ఖమ్మం ప్రెస్‌క్లబ్‌లో గురువారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో సోందుమియా మాట్లాడుతూ ఖమ్మం దానవాయిగూడెంకు చెందిన ఇమామ్ కొడుకు సలీం కువైట్‌లో ఉద్యోగం చేస్తున్నాడని, తమకు తెలిసిన ఏజెన్సీకి డబ్బులు చెల్లిస్తే అబ్రాడ్ వెళ్లవచ్చని




నమ్మబలికినట్లు తెలిపారు. తన అల్లుళ్లకు ఉద్యోగం వస్తుందనే ఆశతో సలీం చూపించిన కన్సల్టెన్సీ వారి ఖాతాకు తన సతీమణి పేరుతో ఎస్‌బిఐ బ్యాంక్ నుండి దఫాల వారీగా గబుదాబీ కమర్షియల్ బ్యాంక్ ఖాతా నెంబర్ఏ ఇ310030000499477208001కు ఇద్దరికి చొప్పున ఆరు లక్షలు చెల్లించినట్లు తెలిపారు. ఆరు నెలలైనా ఉద్యోగం ఇవ్వకపోవడంతో తమ డబ్బులు ఇవ్వాలని అడుగగా తనకు ఇవ్వలేదు, కన్సల్టెన్సీ వారిని అడగండి అంటూ బెదిరిస్తున్నాడని తెలిపారు. కన్సల్టెన్సీ వారిని అడుగగా తమకేం సంబంధం లేదని, సలీంను అడగాలని చెప్పినట్లు తెలిపారు. ఇటీవలనే సలీమ్ ఖమ్మంవచ్చాడని, తాము నిలదీయగా మీ ఇష్టం వచ్చినట్లు చేసుకోండంటూ బెదిరింపు ధోరణితో మాట్లాడాడని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై అర్బన్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. తమను మోసం చేసిన సలీమ్‌తో పాటు అతని తండ్రి ఇమామ్‌పై చర్యలు తీసుకుని తమ డబ్బుల్ని తమకు ఇప్పించాలని వేడుకున్నాడు. లేకుంటే తనకు చావే గతి అని, తాను వడ్డీకి అప్పుతెచ్చి డబ్బులు ఇచ్చినట్లు వాపోయాడు. సోందుమియా కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# ఈ నెల 30న రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయండి: మంత్రి తుమ్మల

### ముఖ్య అతిథిగా సీఎం రేవంత్ రెడ్డి.. రైతు భరోసా నిధుల విడుదల

**ఖమ్మం, ప్రతినిధి జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** ఈ నెల 30న నిర్వహించనున్న రైతు ఆశీర్వాద సభను రైతులు, ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పిలుపునిచ్చారు. ఖమ్మంలో జిల్లా చింతకాని మండలం జగన్నాధపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మంత్రి మాట్లాడుతూ రైతుల సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.రైతు ఆశీర్వాద సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై రైతు భరోసా నిధులను విడుదల చేయనున్నారని మంత్రి వెల్లడించారు. రాష్ట్రంలోని రైతులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ వ్యవసాయ రంగ అభివృద్ధికి కృషి చేస్తోందని పేర్కొన్నారు.రైతులకు అండగా నిలిచేందుకు ప్రభుత్వం అనేక కార్యక్రమాలను చేపడుతోందని, రైతు భరోసా పథకం ద్వారా అర్హులైన రైతులకు ఆర్థిక సహాయం అందిస్తున్నామని మంత్రి తెలిపారు. రైతులంతా ఈ సభలో పాల్గొని ప్రభుత్వ కార్యక్రమాలను



విజయవంతం చేయాలని కోరారు.ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, రైతుల సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం ఎప్పటికప్పుడు చర్యలు తీసుకుంటోందని, వ్యవసాయ రంగానికి మరింత ప్రోత్సాహం అందించే దిశగా ముందుకు సాగుతున్నామని అన్నారు.రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేసేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు, పార్టీ శ్రేణులు సమన్వయంతో పనిచేయాలని మంత్రి తుమ్మల సూచించారు.

# ఖమ్మం అర్బన్ ఎంఈఓను సస్పెండ్ చేయాలని యూఎస్‌ఎఫ్ఐ డిమాండ్


### - ఎంఈఓ సీజ్ చేసిన మరుసటి రోజు నుంచే యూనిఫామ్‌లు, పుస్తకాలు, స్టేషనరీ విక్రయాలు యథావిధిగా కొనసాగుతున్నాయని ఆరోపణ

### - అధిక ధరలతో ఇబ్బందులు పడుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు

### - సమాచారం అందించినా స్పందించని అధికారులు అంటూ విమర్శలు

### - ప్రైవేట్ విద్యాసంస్థలకు కొందరు అధికారులు కొమ్ముకాస్తున్నారంటూ అనుమానాలు

### - సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని డీఈఓకు యూఎస్‌ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ వినతి





**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్):** ప్రైవేట్ విద్యాసంస్థల్లో విద్యా హక్కు చట్టం నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్‌లు, పాఠ్యపుస్తకాలు, స్టేషనరీ సామగ్రిని అధిక ధరలకు విక్రయిస్తున్నారని ఆరోపిస్తూ, పర్యవేక్షణలో విఫలమైన ఖమ్మం అర్బన్ ఎంఈఓపై చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని భారత ఐక్య విద్యార్థి ఫెడరేషన్ (యూఎస్‌ఎఫ్ఐ) జిల్లా కార్యదర్శి బొట్ల సాగర్ డిమాండ్ చేశారు. యూఎస్‌ఎఫ్ఐ ఆధ్వర్యంలో అందిన ఫిర్యాదుల మేరకు ఖమ్మం అర్బన్ ఎంఈఓ తనిఖీలు



నిర్వహించి కొంత సామగ్రిని సీజ్ చేశారని, అయితే మరుసటి రోజు నుంచే ఆయా విద్యాసంస్థల్లో విక్రయాలు యథా విధిగా కొన సాగు తున్నాయని ఆయన ఆరోపించారు. ఈ విషయంపై అధికారులకు సమాచారం అందించినప్పటికీ తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు.విక్రయాలు నిర్వహిస్తున్న విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేయడంతో పాటు, విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరుతూ బుధవారం జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం సమర్పించినట్లు తెలిపారు. దీనిపై డీఈఓ సానుకూలంగా స్పందించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు పేర్కొన్నారు.ఈ సందర్భంగా బొట్ల సాగర్ మాట్లాడుతూ, విద్యను వ్యాపారంగా మార్చి ఇష్టానుసారంగా ఫీజులు పెంచడం, నిబంధనలకు విరుద్ధంగా యూనిఫామ్‌లు, పుస్తకాలు, స్టేషనరీని అధిక ధరలకు విక్రయించడం వల్ల విద్యార్థుల తల్లిదండ్రులు తీవ్ర ఆర్థిక, మానసిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్న సమయంలో, కొందరు అధికారుల నిర్లక్ష్య వైఖరి కారణంగా విద్యాశాఖ ప్రతిష్ఠ దెబ్బతింటోందని ఆయన పేర్కొన్నారు.

# సాంప్రదాయాలకు పెద్దపీట.. చిన్నారుల 'పంచకట్టు' వేడుక

**- అరెంపల అంబేద్కర్ పిల్లలను ఆశీర్వదించిన రాజ్యాంగ పరిరక్షణ వేదిక పౌండర్, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** నేటి తరం పిల్లలకు ఆధునిక విద్యతో పాటు మన సంస్కృతి, సాంప్రదాయ విలువలను అందించడమే నిజమైన సంస్కారం అని రాజ్యాంగ పరిరక్షణ వేదిక పౌండర్, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ అన్నారు. సాంప్రదాయాలకు ప్రతీకగా అరెంపల అంబేద్కర్ – స్వరూప దంపతులు వారి చిన్నారులు అమృత వర్షిణి, అభియాన్ లకు నూతన వస్త్రాలంకరణ, సాంప్రదాయ పంచకట్టు వేడుక దానవాయిగూడెంలోని వెంకటేశ్వర ఫంక్షన్ హాల్ లో బుధవారం అత్యంత వైభవంగా, ఆహ్లాదకరమైన వాతావరణంలో జరిగింది. బంధుమిత్రుల కోలాహలం, చిన్నారుల ముద్దులొలికే నవ్వుల నడుమ ఈ వేడుక కనులపండువగా సాగింది. ఈ మంగళకరమైన వేడుకకు రాజ్యాంగ పరిరక్షణ వేదిక ఫౌండర్, జాతీయ అధ్యక్షులు సయ్యద్ సాదిక్ అలీ ముఖ్య అతిథిగా హాజరై చిన్నారులను హృదయపూర్వకంగా ఆశీర్వదించారు. "అరెంపల అంబేద్కర్ కు వారి తల్లిదండ్రులు ఏ ఆశయంతో ఆనాడు మహోన్నత వ్యక్తి బాబాసాహెబ్ అంబేద్కర్ పేరు పెట్టారో.. నేడు ఆ పేరును సార్థకం చేస్తూ ఈ అంబేద్కర్ కూడా సమాజాభివృద్ధిలో భాగస్వామ్యం కావాలన్నారన్నారు. చిన్నారులు అమృత వర్షిణి, అభియాన్ లు ఉన్నత చదువులు చదివి, ఆయురారోగ్యాలతో వర్ధిల్లి, ఈ సమాజానికి ఉపయోగపడే ఉత్తమ పౌరులుగా ఎదగాలని సయ్యద్ సాదిక్ అలీ అక్షింతలతో ఆశీర్వదించారు. అడుగడుగునా ఆత్మీయతతో పండగ వాతావరణాన్ని తలపించిన ఈ వేడుకలో చిన్నారుల నూతన వస్త్రాలంకరణ అందరినీ ఆకట్టుకుంది. సాంప్రదాయ దుస్తులలో మెరిసిపోయిన చిన్నారులను చూసి అతిథులు మురిసిపోయారు. ఈ వేడుకలో సాదిక్ ఆలీతో పాటు ప్రముఖులు పెంటు సాహెబ్, కుటుంబ యజమాని అంబేద్కర్, కుటుంబ సభ్యులు, స్నేహితులు, బంధుమిత్రులు పాల్గొని చిన్నారులకు అక్షింతలు వేసి దీవెనలు అందజేశారు.

# అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేసిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాలలో భాగంగా ఈరోజు నగరంలోని 33వ డివిజన్‌లో రూ.10 లక్షల మున్సిపల్ సాధారణ నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, నగరంలోని అన్ని డివిజన్లలో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రాధాన్యత ఇస్తూ అభివృద్ధి పనులను వేగవంతంగా చేపడుతున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, పారిశుద్ధ్య సౌకర్యాలు అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 33వ డివిజన్ కార్పొరేటర్ హీనా ఆఫ్రిన్, కో-ఆప్షన్ సభ్యులు నందకుమార్, బల్బీర్ సింగ్, ఎం.డి. ముజీబ్, మున్సిపల్ అధికారులు, డివిజన్ ప్రజలు పాల్గొన్నారు. అనంతరం 58వ డివిజన్‌లోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ చుట్టూ నిర్మించనున్న కాంపౌండ్ వాల్ పనులకు నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలంతో కలిసి భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా నగర అభివృద్ధితో పాటు ప్రజల భద్రతకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనలో కూడా నగరపాలక సంస్థ ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ప్రపుల్ దేశాయ్, కార్పొరేటర్లు సర్దార్ రవీందర్ సింగ్, చంద్ర, మున్సిపల్ అధికారులు, పోలీస్ సిబ్బంది, ప్రజాప్రతినిధులు మరియు స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

# హత్యాయత్నం వెనుక ఉన్న అసలు సూత్రధారులను పట్టుకోండి ...!

**సీపీకి కార్పొరేటర్ సోమిడి వేణు ప్రసాద్ ఫిర్యాదు**

**కరీంనగర్ టౌన్ జూన్ 25(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ 29వ డివిజన్ కార్పొరేటర్, బీజేపీ దళిత మోర్చా జిల్లా అధ్యక్షులు సోమిడి వేణు ప్రసాద్ తనపై జరిగిన హత్యాయత్నంపై సమగ్ర విచారణ జరిపి, అసలు సూత్రధారులను కనిపెట్టి కఠినంగా శిక్షించాలని కోరుతూ కరీంనగర్ పోలీస్ కమిషనర్ (సీపీ)కి గురువారం రోజున ఫిర్యాదు చేశారు. కిసాన్ నగర్ ప్రాంతంలో ప్రభుత్వ భూములను అక్రమ కబ్జాదారుల నుండి కాపాడేందుకు తాను చేస్తున్న కృషి వల్లే, కబ్జాకోరులకు తాను టార్గెట్‌గా మారానని సోమిడివేణు ఫిర్యాదులో పేర్కొన్నారు. ప్రజాప్రతినిధిగా తన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తిస్తుండటంతో, ఓర్వలేని వ్యక్తులు తనపై కక్ష పెంచుకున్నారని ఆయన ఆరోపించారు. ఈ హత్యాయత్నానికి సంబంధించి పోలీసులు ఇప్పటికే ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నప్పటికీ, వారు తనకు పూర్తిగా అపరిచితులని, వారిపై ఎటువంటి వ్యక్తిగత కక్షలు లేవని కార్పొరేటర్ తెలిపారు. వారు స్థానిక కాంగ్రెస్ నాయకులు, కార్పొరేటర్ భర్త అయిన 'బాలరాజు' అనుచరులని తనకు సమాచారం ఉందని ఆయన స్పష్టం చేశారు. భూ కబ్జాల విషయంలో తాను చేస్తున్న పోరాటాన్ని అడ్డుకునేందుకు బాలరాజు తన అనుచరుల ద్వారా పక్కా ప్లాన్ ప్రకారం ఈ దాడి చేయించారని, దీనిపై లోతైన దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. తాజా సంఘటన నేపథ్యంలో తన ప్రాణాలకు తీవ్ర ముప్పు ఉందని, భవిష్యత్తులో మరిన్ని దాడులు జరిగే అవకాశం ఉందని వేణు ప్రసాద్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజా ప్రతినిధిగా ప్రజాసేవలో ఉన్న తనను కాపాడాలని, తనకు తక్షణమే పోలీసు భద్రత కల్పించాలని ఆయన సీపీని కోరారు.



తెర వెనుక ఉండి కుట్రలు పన్నిన అసలైన దోషులను చట్టం ముందు నిలబెట్టాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

# డ్రగ్స్ రహిత సమాజానికి యువత సహకరించాలి: సీపీ గౌష్ ఆలం






**కరీంనగర్, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటూ క్రీడలు, విద్య మరియు సృజనాత్మక కార్యకలాపాలపై దృష్టి సారించాలని కరీంనగర్ పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం పిలుపునిచ్చారు. అంతర్జాతీయ మాదకద్రవ్యాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా గురువారం కరీంనగర్లో భారీ అవగాహన ర్యాలీతో పాటు సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన వీధి నాటకాలు, స్కిట్లు మాదకద్రవ్యాల వల్ల కలిగే దుష్పరిణామాలపై అవగాహన కల్పించాయి. డ్రగ్స్ వినియోగం యువత భవిష్యత్తును నాశనం చేస్తుందని, సమాజం మొత్తం అప్రమత్తంగా ఉండాలని సీపీ సూచించారు. డ్రగ్స్ విక్రయాలు, రవాణా మరియు వినియోగాన్ని ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. యువత, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని కోరారు. అనంతరం పాల్గొన్న వారందరూ డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతిజ్ఞ చేశారు.

# జనసేన తెలంగాణ మీడియా విభాగం కోఆర్డినేటర్‌గా దుంపటి శ్రీనివాస్ నియామకం

**16 ఏళ్లకు పైగా జర్నలిజం అనుభవానికి గుర్తింపు.. జనసేన నాయకత్వం అభినందనలు**



**ఖమ్మం, ప్రతినిధి జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్):** జనసేన పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యాలయం తరపున పార్టీ కార్యక్రమాలు, కార్యకలాపాలను పత్రికా, మీడియా సంస్థలకు చేరవేయడంతో పాటు మీడియా సంస్థలతో సమన్వయం చేసే కీలక బాధ్యతల కోసం సీనియర్ జర్నలిస్ట్ దుంపటి శ్రీనివాస్‌ను తెలంగాణ రాష్ట్ర జనసేన పార్టీ మీడియా విభాగం కోఆర్డినేటర్‌గా నియమించారు. ఖమ్మం నగరానికి చెందిన దుంపటి శ్రీనివాస్ గత 16 సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో కొనసాగుతూ విశేష అనుభవాన్ని సంపాదించారు. తెలంగాణ ఉద్యమ కాలంలో చురుకుగా పాల్గొని రాష్ట్ర సాధన ఉద్యమంలో తన వంతు పాత్ర పోషించారు. అనంతరం జనసేన పార్టీ మీడియా, సాంస్కృతిక విభాగాల్లో అందిస్తున్న సేవలను గుర్తించిన పార్టీ నాయకత్వం ఆయనకు ఈ కీలక బాధ్యతలను అప్పగించింది. ప్రస్తుతం ఆయన జనసేన పార్టీ కీలక నాయకులు, ఎమ్మెల్సీ శ్రీ నాగబాబు గారి పీఆర్ఓగా కూడా బాధ్యతలు నిర్వహిస్తూ, మీడియా సమన్వయం, సమాచార ప్రసారం వంటి అంశాల్లో తన సేవలను అందిస్తున్నారు. పీఆర్ఓగా ఆయన అందిస్తున్న సేవలు, జర్నలిజం రంగంలో ఉన్న అనుభవం, మీడియా సంస్థలతో ఉన్న సత్సంబంధాలను పరిగణనలోకి తీసుకుని ఈ బాధ్యతలను అప్పగించినట్లు పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ సందర్భంగా జనసేన పార్టీ నాయకత్వం మాట్లాడుతూ, దుంపటి శ్రీనివాస్‌కు ఉన్న సుదీర్ఘ జర్నలిజం అనుభవం, మీడియా రంగంపై ఉన్న అవగాహన పార్టీ మీడియా విభాగానికి మరింత బలాన్ని చేకూరుస్తుందని, పార్టీ కార్యక్రమాలు, ప్రజా సమస్యలను సమర్థవంతంగా ప్రజల్లోకి తీసుకెళ్లడంలో ఆయన కీలక పాత్ర పోషిస్తారని ఆశాభావం వ్యక్తం చేసింది. పార్టీ విధానాలు, ప్రజా సమస్యలపై జనసేన చేపట్టే కార్యక్రమాలను మీడియా వేదికల ద్వారా ప్రజల్లోకి తీసుకెళ్లడం, పత్రికా ప్రతినిధులతో సమన్వయం చేయడం వంటి బాధ్యతలను దుంపటి శ్రీనివాస్ నిర్వహించనున్నారు. ఇకపై తెలంగాణ రాష్ట్రంలో జనసేన పార్టీకి సంబంధించిన మీడియా, పత్రికా సంబంధిత అంశాలపై సమాచారం కోసం పత్రికా మరియు మీడియా మిత్రులు జనసేన తెలంగాణ రాష్ట్ర మీడియా విభాగం కోఆర్డినేటర్ దుంపటి శ్రీనివాస్‌ను సంప్రదించాలని పార్టీ కార్యాలయం ఒక ప్రకటనలో తెలిపింది.

# పైడిపెల్లిలో 9వ రోజు దద్దరిల్లిన పీరీల ఊరేగింపు




**వరంగల్, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** వరంగల్ జిల్లా పైడిపెల్లి గ్రామంలో నిర్వహిస్తున్న గడప గడప ఉత్సవాలు తొమ్మిదో రోజు ఘనంగా కొనసాగాయి. పైడిపెల్లి దర్గా పీఠాధిపతి జనాబ్ మొహమ్మద్ అంకుశవాలి సాహెబ్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ వేడుకలు భక్తిశ్రద్ధలతో, ఆధ్యాత్మిక వాతావరణంలో సాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక ప్రార్థనలు, సంప్రదాయ కార్యక్రమాలు నిర్వహించగా, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. ముస్లింలు, హిందువులు కలిసి సోదరభావంతో పాల్గొనడం ఈ వేడుకలకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. మత సామరస్యానికి ప్రతీకగా నిలిచిన ఈ కార్యక్రమం గ్రామంలో ఐక్యతా భావాన్ని మరింత బలోపేతం చేస్తోందని పలువురు అభిప్రాయపడ్డారు. భక్తుల రద్దీ మధ్య రంగురంగుల అలంకరణలు, సంప్రదాయ పద్ధతుల్లో నిర్వహించిన కార్యక్రమాలు కన్నుల పండువగా నిలిచాయి. గ్రామంలో పండుగ వాతావరణం నెలకొనగా, అన్ని వర్గాల ప్రజలు ఉత్సాహంగా పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.

# విధులలో చేరిన వారం రోజుల్లోనే ప్రశంసలు అందుకున్న తొర్రూర్ డిఎం ప్రసన్న లక్ష్మి

**-డిఎంకు అభినందనలు తెలిపిన రీజినల్ డిప్యూటీ ఆర్ ఎం కిషన్ రావు.**

**-తొర్రూర్ టి జి ఎస్ ఆర్ టి సి బస్ డిపో ను సుందర్శించిన డిప్యూటీఆర్ఎం కిషన్ రావు**



**తొర్రూరు ప్రతినిధి, జూన్ 25(పీసీడబ్ల్యూ న్యూస్):** వరంగల్ రీజినల్ లో తొర్రూర్ టి జి ఎస్ ఆర్ టి సి బస్సు డిపో గత కొన్ని సంవత్సరాలుగా మంచి పేరును సాధించుకుంటూనే ఉంది. ఈ పేరు వెనుక అధికారుల పట్టుదల, కార్మికుల కృషి, డీఎంల ప్రోత్సాహం. తొర్రూరు డిపో కు నూతనంగా చేరిన ప్రసన్న లక్ష్మి కి వారం రోజులలోనే అరుదైన గౌరవాన్ని దక్కించుకోంది. టీజీఎస్ ఆర్టీసీలో సాధరన బదిలీల్లో భాగంగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన డిప్యూటీ ఆర్ఎం కిషన్ రావు గురువారం తొర్రూర్ డిపోను సందర్శించారు. ఈ సందర్భంగా డిపో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచినందుకు డిపో మేనేజర్ ప్రసన్న లక్ష్మి ని, డిపోలో ఎంఎఫ్ గా విధులు నిర్వహిస్తూ కార్మికులతో తోటి ఉద్యోగస్తులతో ఎప్పటికప్పుడు సమస్యలను తెలుసుకుంటూ డిపోలోని పరిసర ప్రాంతాలన్నిటిని పరిశుభ్రంగా ఉంచేందుకు కృషి చేస్తున్న విజయ్ కుమార్ ని కూడా ప్రత్యేకంగా డిప్యూటీ ఆర్ ఎం అభినందించారు. డిపో గ్యారేజ్ ఆవరణాన్ని క్షుణ్ణంగా పరిశీలించి టైర్ మైలేజీని పెంచడమే కాకుండా గ్యారేజ్ సిబ్బంది తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తించి డిపో అభివృద్ధికి సహకరించాలని కోరారు. అదేవిధంగా గ్యారేజ్ సిబ్బందికి తగు సలహాలు సూచనలు ఇచ్చారు. డిపో మేనేజర్ ప్రసన్న లక్ష్మి ఆధ్వర్యంలో డిపో ఆవరణంలో మొక్కను నటించారు. డిపో మేనేజర్ ప్రసన్న లక్ష్మి ఈ సందర్భంగా ప్రసంగిస్తూ గతంలో మాదిరిగానే రీజియన్ లో మొదటి స్తానంలో తొర్రూర్ డిపోను నిలిపేందుకు ఉద్యోగులంతా తమ తమ విధులను సక్రమంగా నిర్వర్తిసు డిపో అభివృద్ధికి సహకరించలన్నారు.. అందరూ కల్మేడిగా విధులు నిర్వహిస్తూ సమస్యలను ఒకరికొకరు అర్థం చేసుకున్నప్పుడే డిపో అభివృద్ధి దిశగా ప్రయాణిస్తాయని పేర్కొన్నారు. ఎవరికి ఎలాంటి సమస్య ఉన్న మనుషుల్లో దాచుకోకుండా తెలిపినప్పుడే ఎలాంటి అపోహాలకు దారి లేకుండా సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. ఈ సమావేశంలో ఎడిసి, మెకానికులు, శ్రామికులు, తదిరులు పాల్గొన్నారు.

# యువత మత్తు పదార్ధాలకు దూరంగా ఉండాలీ



**హనుమకొండ, జూన్ 26 (పిసిడబ్ల్యూ న్యూస్):** యువత గంజాయి, డ్రగ్స్, ఆల్కహాల్ కు దూరంగా ఉండాలని న్యూ విజన్ ఆల్కహాల్, డ్రగ్ డీ అడిక్షన్ సెంటర్ డైరెక్టర్ ఏ. సురేందర్ రావు తెలిపారు. గురువారం అంతర్జాతీయ మాదకద్రవ్యాల దుర్వినియోగం, తమ రవాణా నిరోధక దినోత్సవం సందర్భంగా సుబేదారిలోని 'న్యూ విజన్ 'కార్యాలయంలో ఆయన మాటడుతూ మాదక ద్రవ్యాలకు స్వస్తి పలికి ఆరోగ్యవంతమైన సమాజాన్ని నిర్మిద్దాంన్నారు. ప్రభుత్వ యత్రాశీగం, స్వచ్ఛంద సంస్థల, ఆల్కాల్ డ్రగ్ డి అడాక్షన్స్ సెంటర్ లు సమన్వయంతో పని చేస్తే మత్తు పదార్థాల నిర్మూలన సాధ్యంమవుతుందని చెప్పారు. నేటి సమజాములో పట్టి పిడిస్తున్న మాదక ద్రవ్యాల వ్యసనం పెను సవాలుగా మారుతుందని పేర్కొన్నారు. యువత మత్తు పదార్థాలు వదిలి క్రీడా మైదానాల వైపు దృష్టి సారించాలని సూచించారు. మత్తు పదార్థులు ఎక్కడైనా అనుమానాస్పదంగా కనిపిస్తే వెంటనే స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేయాలని సురేందర్ రావు కోరారు.

# తెలంగాణ ఉద్యమకారుల త్యాగానికి చట్టబద్ధ గుర్తింపు దక్కాలి..!

తెలంగాణ తోలి - మలి దశ ఉద్యమం (1969 - 2014) ప్రపంచ చరిత్రలోనే ఒక అరుదైన, సుదీర్ఘమైన ప్రజాస్వామ్య పోరాటం. కోట్లాది మంది ఆకాంక్షలు, వేలాది మంది బలిదానాలు, లక్షలాది మంది త్యాగాల పునాదుల మీద 'తెలంగాణ రాష్ట్రం' ఆవిర్భవించింది. నాడు జైలు గోడల మధ్య నలిగిన వారు, లాఠీ దెబ్బలకు గురైన వారు, కోర్టుల చుట్టూ తిరిగిన వారు, విద్యార్థులు, మేధావులు, ఉద్యోగులు, కార్మికులు తమ సర్వస్వాన్ని పణంగా పెట్టి పోరాడారు. అయితే, స్వరాష్ట్రం సిద్ధించి ఇన్నేళ్లవుతున్నా.. క్షేత్రస్థాయిలో నిజమైన ఉద్యమకారులను గుర్తించడం, వారికి దక్కాల్సిన గౌరవాన్ని అందించడం అనే ప్రక్రియ ఇంకా ఒక కొలిక్కి రాలేదు. సంక్లిష్టమైన నిబంధనలు, అధికార యంత్రాంగం చుట్టూ తిరగాల్సిన దుస్థితి వల్ల అసలైన పోరాట యోధులు విస్మరణకు గురవుతున్నారు. ఈ నేపథ్యంలో, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన విప్లవాత్మక హామీల నేపథ్యంలో, ఉద్యమకారుల గుర్తింపు ప్రక్రియను మరింత సరళంగా, పారదర్శకంగా మరియు గౌరవప్రదంగా మార్చేందుకు ప్రభుత్వం తక్షణమే కొన్ని నిబంధనలను, ప్రతిపాదనలను అమలు చేయాల్సిన అవసరం ఉంది.

### మేనిఫెస్టో హామీల అమలుకు సులభతర మార్గం

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ఉద్యమకారుల కోసం అత్యంత ప్రతిష్టాత్మకమైన అంశాలను చేర్చింది. అందులో ముఖ్యంగా అమరవీరుల కుటుంబాలకు భరోసా. మొదటి మరియు మలిదశ ఉద్యమ అమరవీరుల కుటుంబాలను అధికారికంగా గుర్తించి, ఆయా కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, అలాగే వారి తల్లి/తండ్రి/భార్యకు నెలకు రూ. 25,000 గౌరవ పెన్షన్ అందిస్తామని ప్రకటించింది. తెలంగాణ ఉద్యమంలో పాల్గొన్న యువతపై నమోదైన అన్ని కేసులను బేషరతుగా ఉపసంహరించుకుని, వారికి అధికారిక 'తెలంగాణ ఉద్యమకారుడి గుర్తింపు కార్డు' జారీ చేస్తామని హామీ ఇచ్చింది. ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద ప్రతి తెలంగాణ ఉద్యమకారునికి 250 చదరపు గజాల ఇండ్ల స్థలాన్ని కేటాయిస్తామని ప్రభుత్వం వాగ్దానం చేసింది. ఈ మహత్తరమైన హామీలు నిజమైన అర్హులకు త్వరితగతిన చేరాలంటే, గుర్తింపు నిబంధనలను ప్రభుత్వం సులభతరం చేయాల్సి ఉంది. అందుకోసం సంక్లిష్టమైన దరఖాస్తు విధానానికి స్వస్తి పలికాలి. పారదర్శకత కోసం ప్రభుత్వం ఒక కేంద్రీకృత ఆన్‌లైన్ పోర్టల్ (తెలంగాణ ఉద్యమ స్ఫూర్తి పోర్టల్') ను ఏర్పాటు చేయాలి. కేసులు ఉపసంహరణకు మరియు 250 గజాల స్థలాల కేటాయింపునకు కావలసిన దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారానే స్వీకరించాలి. దరఖాస్తు ఏ దశలో ఉందో (జిల్లా కమిటీ పరిశీలన లేదా తుది ఆమోదం) దరఖాస్తుదారునికి ఎప్పటికప్పుడు ఎస్ఎంఎస్ ద్వారా సమాచారం అందేలా ట్రాకింగ్ వ్యవస్థను రూపొందించాలి. కేసుల రికార్డులతో పాటు ఆధారాల సరళీకరణ చేయాలి. కేవలం పోలీస్ రికార్డులు, ఎఫ్ఐఆర్ కాపీలు ఉన్నవారిని మాత్రమే ఉద్యమకారులుగా పరిగణించడం సరైనది కాదు. ఎందుకంటే నాటి ఉద్యమంలో తెరవెనుక ఉండి నడిపిన వారు, కళాకారులు, కవులు, పోస్టర్లు అంటించిన వారు, వంటా-వార్పులో పాల్గొన్న మహిళలపై కేసులు నమోదు కాలేదు. కాబట్టి గుర్తింపు నిబంధనలను కింది విధంగా విస్తరించాలి. ఇప్పటికే గుర్తింపు పొందిన లేదా నాటి జేఏసీ నాయకులు, ముగ్గురు ప్రముఖ ఉద్యమకారులు సదరు వ్యక్తి ఉద్యమంలో క్రియాశీలకంగా పాల్గొన్నారని ధృవీకరిస్తూ ఇచ్చే అఫిడవిట్ సహ-ఉద్యమకారుల సాక్ష్యం) ను ప్రామాణికంగా తీసుకోవాలి. నాటి పత్రికల వార్తా క్లిప్పింగులు, ఛాయాచిత్రాలు, లేదా స్థానిక ప్రజా సంఘాల రికార్డులను కూడా పరిగణనలోకి తీసుకోవాలి. ప్రజా భాగస్వామ్యంతో 'గ్రామసభల' ద్వారా లబ్ధిదారుల ఎంపిక చేయాలి. నకిలీ ఉద్యమకారుల నిరోధానికి మరియు అర్హులకు న్యాయం చేయడానికి క్షేత్రస్థాయి పరిశీలన అత్యంత కీలకం. దరఖాస్తుల ప్రాథమిక పరిశీలన అనంతరం, సదరు గ్రామంలో లేదా మున్సిపల్ వార్డులో 'గ్రామసభ' నిర్వహించి, ప్రజల సమక్షంలో అర్హుల జాబితాను చదివి వినిపించాలి. గ్రామానికి తెలుసుఎవరు ఉద్యమంలో జైలుకు వెళ్లారో, ఎవరు పోరాడారో! దీనివల్ల రాజకీయ సిఫార్సులకు, అక్రమాలకు తావుండదు. ప్రభుత్వం హామీ ఇచ్చినట్లుగా అధికారిక 'గౌరవ గుర్తింపు కార్డులు' కేవలం రాయితీల కోసమే కాకుండా, వారి ఆత్మగౌరవాన్ని పెంచేలా ఉండాలి. సగర్వ సన్మానంతో పాటు అధికారిక ప్రోటోకాల్ వర్తించాలి. ప్రభుత్వ అధికారిక కార్యక్రమాలలో (స్వాతంత్ర్య దినోత్సవం, గణతంత్ర దినోత్సవం, తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాల్లో) వీరికి ప్రత్యేక ఆసనాలు, గౌరవప్రదమైన ఆహ్వానాలు దక్కేలా ప్రోటోకాల్ నిబంధనలను రూపొందించాలి. మేనిఫెస్టోలో పేర్కొన్న రూ. 25,000 పెన్షన్ మరియు ఇండ్ల స్థలాలతో పాటు వయసు పైబడిన ఉద్యమకారుల ఆరోగ్యంపై కూడా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. సామాజిక భద్రత మరియు ఆరోగ్య హక్కు కల్పించాలి. గుర్తింపు పొందిన ప్రతి ఉద్యమకారునికి, వారి కుటుంబ సభ్యులకు కార్పొరేట్ ఆసుపత్రుల్లో సైతం ఉచిత వైద్యం అందేలా 'ప్రత్యేక హెల్త్ కార్డులు' జారీ చేయాలి. ప్రభుత్వ కమిటీలలో ప్రాధాన్యత కల్పించాలి. వివిధ కార్పొరేషన్లు, మార్కెట్ కమిటీలు లేదా ప్రభుత్వ సలహా సంఘాల్లో నామినేటెడ్ పదవుల కేటాయింపులో ఉద్యమకారులకు నిర్దిష్ట ప్రాధాన్యత ఇవ్వాలి. తెలంగాణ ఉద్యమకారులు ప్రభుత్వాన్ని యాచించడం లేదు.. తాము చేసిన త్యాగానికి కనీస గుర్తింపును, ఆత్మగౌరవాన్ని మాత్రమే ఆశిస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో ప్రకటించిన రూ. 25,000 పెన్షన్, ఇండ్ల స్థలాలు, కేసుల ఉపసంహరణ మరియు ప్రభుత్వ ఉద్యోగాల హామీలు నిజమైన యోధులకు అందాలన్నా.. నకిలీలను ఏరివేయాలన్నా నిబంధనల సరళీకరణ అత్యంత అవసరం. ప్రభుత్వం ఈ ప్రతిపాదనలను స్వీకరించి, పారదర్శకమైన విధానం ద్వారా నిజమైన యోధులను గౌరవించుకుంటేనే.. అది నాడు అమరులైన వీరులకు మనం ఇచ్చే అసలైన నివాళి అవుతుంది. మేనిఫెస్టో హామీలను చట్టబద్ధమైన మార్గదర్శకాలుగా మార్చి, ఉద్యమకారుల ముఖాల్లో ఆనందాన్ని నింపాల్సిన చారిత్రక బాధ్యత ప్రస్తుత ప్రభుత్వంపై ఎంతైనా ఉంది.



ది.25.06.2026
విశ్వ జంపాల న్యాయవాది రాష్ట్ర ఉపాధ్యక్షులు తెలంగాణ విద్యావంతుల వేదిక మొబైల్ నెం. 7793968907

# దీసీఎం ప్రకటనలకు జవాబుదారీ ఉండాలి

- సీతారామ' పూర్తిచేస్తారా లేదా
- పూర్తి కోసం సీఎం పెట్టిన గడువు పూర్తి
- 2024, 2025 రబీ రైతుభరోసా సంగతేంటి
- 8 నెలలైనా 'సామినేని' హత్యకేసు తేల్చలే..!
- ఖమ్మం జిల్లా విద్యారంగం ఖాళీలమయం
- సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే 'దుమ్ముగూడెం'
- జిల్లాలోని ముగ్గురు మంత్రులు తలా ఒక కాలువ తవ్వుకుంటున్నారు గానీ ఒక యూనివర్సిటీ గానీ, ఒక పరిశ్రమ గానీ తీసుకురాలేదు. ఏ ప్రాజెక్టు పూర్తి చేయలేదు
- కాంగ్రెసు ను ఆదరించినా ఖమ్మం జిల్లాకు నిరాదరణ
- ఏమి చేశారని రైతు, ప్రజా ఆశీర్వాదం
- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని




**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్ జిల్లాలోని ఏడు లక్షల ఎకరాలను సస్యశ్యామలం చేసే సీతారామ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు విషయంలో ప్రభుత్వం నిర్లక్ష్యం చేస్తోందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు పోతినేని సుదర్శన్ రావు ధ్వజమెత్తారు. నిధులను వరదలా పారించి ప్రాజెక్టును 2026 పంద్రాగష్టు లోగా అందుబాటులోకి తీసుకొస్తామని 2024 వైరా సభ, సీతారామ పంప్ హౌస్ ల ప్రారంభం సందర్భంగా హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దానిని తుంగలో తొక్కారన్నారు. ఈనెల 30న చింతకాని మండలంలో నిర్వహించే రైతు, ప్రజా ఆశీర్వాద సభకు హాజరవుతున్న సీఎం సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తారో.. లేదో స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. సీపీఐ(ఎం) పోరాట ఫలితంగానే దుమ్ముగూడెం (సీతారామ) ప్రాజెక్టు సిద్ధించిందన్నారు. పార్టీ కేంద్ర కమిటీ సభ్యులు, మాజీ ఎంపీ తమ్మినేని వీరభద్రంతో పాటు తానూ ఈ ప్రాజెక్టు సాధనకు పాదయాత్ర చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఖమ్మంలోని సుందరయ్య భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు వై.విక్రమ్, కళ్యాణం వెంకటేశ్వరరావు, యర్రా శ్రీనివాసరావుతో కలిసి బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోతినేని మాట్లాడారు.

**నెలన్నర రోజుల్లో 'సీతారామ' పూర్తి చేయగలరా..**

కాంగ్రెస్ ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ముగ్గురు మంత్రులున్నా ప్రభుత్వం జిల్లాను నిరాదరణకు గురిచేస్తోందని పోతినేని అన్నారు. 2026 పంద్రాగష్టు లోగా సీతారామ ప్రాజెక్టును పూర్తిచేస్తామని స్వయంగా సీఎం పెట్టిన గడువు నెలన్నర రోజుల్లో పూర్తవుతుందని తెలిపారు. రూ.18వేల కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన ఈ ప్రాజెక్టు కోసం రూ.8వేల కోట్లు ఇప్పటికే ఖర్చుపెట్టామని, ఇంకా రూ.10వేల కోట్లతో ప్రాజెక్టు రెండేండ్లలో పూర్తవుతుందని 2024లో సీఎం చెప్పిన మాటను వీడియో రూపంలో ప్రదర్శించారు. సీఎం పెట్టిన 2026 పంద్రాగష్టు గడువుకు ఇంకా నెలన్నర రోజులు మాత్రమే ఉంది... చేయగలరా అని ప్రశ్నించారు. రూ.18వేల కోట్ల అంచనాలు రూ.19వేల కోట్లకు చేరాయన్నారు. సీఎం హామీ ఇచ్చిన తర్వాత రెండు బడ్జెట్లు ప్రవేశపెట్టారని, రెండింటిలో కలిపి రూ.600 కోట్లు మాత్రమే కేటాయించారన్నారు. ముగ్గురు మంత్రులు తలా ఒక కాల్వ చొప్పున తవ్వుకుంటున్నారని తెలిపారు. శ్రీనివాసరెడ్డి మున్నేరు టూ పాలేరు లింక్ కెనాల్, తుమ్మల రాజీవ్, భట్టి జవహర్ కెనాల్స్ తవ్వుకుంటున్నారని వివరించారు. ప్రాజెక్టు పూర్తికాకుండా కాల్వలు తవ్వుకుంటే ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 2016 ఫిబ్రవరిలో కేసీఆర్ రోళ్లపాడు వద్ద ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారన్నారు. 2003లో సీపీఐ(ఎం) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని దుమ్ముగూడెం ప్రాజెక్టు కోసం 2,600 కి.మీ పాదయాత్ర చేశారని తెలిపారు. 2012లో తాను జిల్లా కార్యదర్శిగా ఉన్నప్పుడు దుమ్ముగూడెం నుంచి పాలేరు వరకూ వెయ్యి మంది రైతులతో తాను పాదయాత్ర చేసిన విషయాన్ని ప్రస్తావించారు. కృష్ణా గోదావరి అనుసంధానం కోసం ఉద్దేశించిన సీతారామ ప్రాజెక్టు విషయంలో కృష్ణా పరివాహక ప్రాంతంలో మంత్రులు కెనాల్స్ తీస్తూ పోతే ఉపయోగం ఏంటని ప్రశ్నించారు. 124 కి.మీ పొడవున్న సీతారామ ప్రాజెక్టు కెనాల్స్ లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేనాటికి 104 కి.మీ పూర్తయ్యాయని చెప్పారు. 104 కి. మీ వద్ద జూలూరుపాడు, దమ్మాయిగూడెం టన్నెల్స్ పూర్తి చేస్తే గోదావరి నీళ్లు పాలేరు రిజర్వాయర్ లో కలుస్తాయన్నారు. సీతారామ ప్రాజెక్టును పూర్తి చేస్తారా లేదా స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్‌ను ఆదరించిన ఖమ్మం జిల్లాలో ఓ ప్రాజెక్టు పూర్తి చేశారా ఓ పరిశ్రమ, ఓ యూనివర్శిటీ స్థాపించారా అని నిలదీశారు. ఏమి చేశారని రైతులు, ప్రజలు ఆశీర్వదించాలని ప్రశ్నించారు. ఎల్ నినో ఎఫెక్ట్ నేపథ్యంలో వర్షాభావ పరిస్థితులు ఏర్పడుతున్న దృష్ట్యా వేసిన పంటల్లో 30శాతం విత్తనాలు మొలకెత్తలేదన్నారు. ఈ నేపథ్యంలో గోదావరి నీళ్లు రాకపోతే ఏంటి పరిస్థితి అని సీఎంను ప్రశ్నించారు. ఈ ఏడాది బడ్జెట్లో రూ.22వేల కోట్లు నీటిపారుదల ప్రాజెక్టులకు కేటాయిస్తే దీనిలో కేవలం రూ.360 కోట్లు సీతారామకు కేటాయించటం సిగ్గుచేటన్నారు. 2026 ఖరీఫ్ రైతుభరోసా నిధుల విడుదల కోసం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఖమ్మం జిల్లాకు రావడాన్ని స్వాగతిస్తున్నామని పోతినేని తెలిపారు. కానీ 2024, 2025 రబీ రైతుభరోసా నిధులు ఇస్తారో... లేదో స్పష్టతనివ్వాలని డిమాండ్ చేశారు. పంటలు వేయడానికి ఇచ్చే రైతుభరోసా నిధులను సంవత్సరాల కొద్దీ పెండింగ్ పెట్టడాన్ని తప్పుబట్టారు.

**రాష్ట్రంలో శాంతిభద్రతల క్షీణత :** రాష్ట్రంలో మరీ ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో శాంతిభద్రతలు క్షీణిస్తున్నాయని పోతినేని ఆరోపించారు. ఉమ్మడి రాష్ట్ర రైతుసంఘం రాష్ట్ర కార్యదర్శి సామినేని రామారావు హత్య జరిగి 8 నెలలవుతున్నా ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఈ హత్యకు పాల్పడిన వారిలో కాంగ్రెస్ వాళ్లు ఉన్నారని రామారావు భార్య చెబుతున్నా పట్టించుకోరా అని నిలదీశారు. ఈ హత్య విషయమై తేల్చాలని మండల కేంద్రం మొదలు శాసనసభ దాకా దీనిని తీసుకెళ్లామన్నారు. సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రిని ఈ విషయమై కలిసిన సందర్భాలను వివరించారు. రామారావు హత్య జరిగిన చింతకాని మండలంలోని సభకే సీఎం హాజరవుతున్న నేపథ్యంలో ఈ సభా వేదికపై నుంచే దీనికి సమాధానం చెప్పాలని కోరారు. హత్య, దొంతనం, రేప్ ఏది జరిగినా హోంశాఖ మంత్రిగానూ ఉన్న సీఎం పట్టించుకోరా అని ప్రశ్నించారు.

**విద్యారంగానికి చేసిందేంటి..** ఖమ్మం జిల్లా విద్యారంగానికి ప్రభుత్వం చేసిందేంటని సుదర్శన్ నిలదీశారు. ఓ యూనివర్శిటీ నిర్మించారా అని అడిగారు. ఖమ్మం జిల్లాలో 21 ఎంఈవో పోస్టులుంటే 19, డైట్ కళాశాలలో 13కు 13 పోస్టులు రెగ్యులర్ ఉద్యోగులు లేకుండా ఉన్నాయని తెలిపారు. విద్యార్థులకు పోషకాహారం అందించాలనే ఆలోచన మంచిదే అయినా ఆచరణ ఏదన్నారు. బ్రేక్ ఫాస్ట్ అమలవుతుందా అని ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా వ్యవసాయ, విద్యారంగ సమస్యలను పరిష్కరించేలా ఆచరణయోగ్యమైన దిశగా చర్యలు ఉండాలన్నారు. జిల్లా సమస్యలు పరిష్కరించకపోతే ఉద్యమిస్తామని ముఖ్యమంత్రి, మంత్రులను హెచ్చరించారు. జవాబుదారీ ఉండేలా సీఎం ప్రకటనలు ఉండాలని కోరారు.


# ప్రభుత్వ ఆసుపత్రి ఉద్యోగుల రిలే నిరాహార దీక్షలు



### కనీస వేతనం రూ. 26 వేలు చెల్లించాలని డిమాండ్

**వరంగల్,జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ ఆసుపత్రులు, మెడికల్ కాలేజీలలో పనిచేస్తున్న కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ 'తెలంగాణ యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్' (CITU) ఆధ్వర్యంలో గురువారం రిలే నిరాహార దీక్షలు చేపట్టారు. స్థానిక ఎంజీఎం ఆసుపత్రి, ప్రాంతీయ కంటి ఆసుపత్రి, కాకతీయ వైద్య కళాశాల, సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల ఎదుట ఈ ఆందోళనలు జరిగాయి. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యాదనాయక్, రాష్ట్ర ఉపాధ్యక్షులు జె. సుధాకర్ మాట్లాడుతూ.. సెక్యూరిటీ, శానిటేషన్, పేషెంట్ కేర్, స్వీపర్లు, డేటా ఎంట్రీ ఆపరేటర్ల వేతనాలు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీని ఇంతవరకు అమలు చేయకపోవడం దుర్మార్గమన్నారు. కనీస వేతనం రూ. 26,000 చెల్లించాలి. పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను సక్రమంగా అమలు చేయాలి. ప్రతి నెల 1వ తేదీనే వేతనాలు చెల్లించి, ఉద్యోగ భద్రత కల్పించాలి. సిబ్బందికి తగినన్ని సెలవులు మంజూరు చేయాలి. ప్రభుత్వం తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించకపోతే, జూలై నెలలో దశలవారీగా ఆందోళనలు ఉధృతం చేసి "నిరవధిక సమ్మె"కు దిగుతామని నాయకులు హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎండి సాదిక్, రమేష్, జంపన్న, మోహన్, అశోక్, రమాదేవి, పుష్ప, లత, కవిత తదితరులు పాల్గొన్నారు.

# కిలారు భవ్యశ్రీని ఆశీర్వదించిన సర్పంచ్ గొడ్ల ప్రభాకర్



**తల్లాడ, జూన్ 25 (పిసిడబ్ల్యూ న్యూస్) :** తల్లాడ మండలం అన్నారుగూడెం గ్రామంలో కిలారు శ్రీను (డాన్ శ్రీను) తిరుపతమ్మ దంపతుల కుమార్తె కిలారు భవ్యశ్రీకి ఓనీల వేడుక గురువారం స్థానిక శ్రీ సాయిబాబా కళ్యాణ మండపం నందు ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సర్పంచ్ గొడ్ల ప్రభాకర్ హాజరై చిన్నారి భవ్యశ్రీని అక్షింతలు దీవించారు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో జీవించాలని ఉన్నతమైన విద్యనభ్యసించి ఉన్నత స్థితిలో జీవించాలని గ్రామానికి తల్లిదండ్రులకు మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని ఈ సందర్భంగా ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ మండల నాయకులు దొడ్డ చిన్న శ్రీనివాసరావు, నాయకులు మారెళ్ళ దేవేందర్, తుమ్మలపల్లి వెంకటేశ్వరరావు, ఇస్నపల్లి శ్రీను, నగేష్, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

# సేవాస్ఫూర్తికి సాక్ష్యంగా గ్రామీణ వైద్యుల ఆత్మీయ కలయిక

**- సహచరుడి జీవితంలోని శుభ ఘట్టానికి అండగా నిలిచిన తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం నాయకులు**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** గ్రామీణ ప్రజల ఆరోగ్య సంరక్షణలో నిరంతరం అంకితభావంతో సేవలందిస్తూ, మానవత్వానికి ప్రతిరూపాలుగా నిలుస్తున్న గ్రామీణ వైద్యులు తమ సహచరుల సంతోషాలను సైతం కుటుంబ సభ్యుల్లా పంచుకుంటూ ఐక్యతకు నిదర్శనంగా నిలుస్తున్నారు. ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం, తుమ్మలపల్లి గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు జూబ్బరి భాస్కర్ జ్యోతి దంపతుల ఎంగేజ్మెంట్ కార్యక్రమం ఆత్మీయ వాతావరణంలో ఘనంగా జరిగింది. ఈ శుభ సందర్భానికి తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాళ్లూరి నరసింహారావు, రాష్ట్ర అధికార ప్రతినిధి అన్నరపు నాగేశ్వరరావు హాజరై నూతన దంపతులకు ఆశీర్వాదాలు అందజేశారు. అలాగే కొణిజర్ల మండల కార్యవర్గ సభ్యులు దోర్నాల లోకేష్, దుర్గం నరేష్, సీనియర్ గ్రామీణ వైద్యులు గడల శ్రీనివాసరావుతో పాటు పలువురు గ్రామీణ వైద్యులు పాల్గొని కార్యక్రమానికి ప్రత్యేక శోభను తీసుకొచ్చారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర అధ్యక్షులు దాసరి నరేష్ మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో వైద్య సేవలు అందుబాటులో లేని సమయంలో ప్రజలకు తొలి వైద్య సహాయకులుగా గ్రామీణ వైద్యులు ఎంతో గొప్ప సేవలందిస్తున్నారని పేర్కొన్నారు. పగలు, రాత్రి అనే తేడా లేకుండా ప్రజల ఆరోగ్య పరిరక్షణ కోసం కృషి చేసే గ్రామీణ వైద్యుల సేవలు సమాజానికి అమూల్యమైనవని కొనియాడారు. సహచరుల కుటుంబ వేడుకల్లోనూ ఒక కుటుంబ సభ్యుల్లా పాల్గొనడం తెలంగాణ గ్రామీణ వైద్యుల సమానత్వ సంఘం ఐక్యతకు, పరస్పర అనుబంధానికి ప్రతీక అని వారు అన్నారు. వ్యక్తిగత ఆనందాలను సామూహిక సంతోషాలుగా మార్చుకోవడం ద్వారా సంఘం సభ్యుల మధ్య మరింత సోదరభావం, ఆత్మీయత పెంపొందుతుందని అభిప్రాయపడ్డారు. ప్రజాసేవే పరమావధిగా ముందుకు సాగుతున్న గ్రామీణ వైద్యులు, వృత్తిపరమైన బాధ్యతలతో పాటు మానవీయ విలువలను కూడా పరిరక్షిస్తూ సమాజంలో ఆదర్శంగా నిలుస్తున్నారని ఈ సందర్భంగా పలువురు ప్రశంసించారు. నూతన జీవితంలోకి అడుగుపెడుతున్న జూబ్బరి భాస్కర్ జ్యోతి దంపతులకు సంఘం నాయకులు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేస్తూ, వారి వైవాహిక జీవితం ఆనందం, ఆయురారోగ్యాలు, సిరిసంపదలతో నిండి ఉండాలని ఆకాంక్షించారు

# ఎస్.ఐ.ఆర్. ప్రక్రియను సమర్థవంతంగా పూర్తి చేయాలి

**• ఓటరు జాబితా సవరణలో మొదటి దశను పకడ్బందీగా నిర్వహించాలి • ఇంటింటికీ వెళ్ళి ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలు అందించాలి • పారదర్శక ఓటరు జాబితా రూపకల్పనలో రాజకీయ పార్టీల ప్రతినిధులు భాగస్వాములు కావాలి • జిల్లా కేంద్రంలోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓకు వివరాలు నమోదు చేసిన వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేసిన జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే హౌస్-టు-హౌస్ ఎన్యుమరేషన్ ప్రక్రియ అత్యంత కీలకమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ అన్నారు. గురువారం ప్రారంభమైన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నగరం 46వ డివిజన్‌లోని కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో బీఎల్ఓ జిల్లా కలెక్టర్‌కు వ్యక్తిగత ఎన్యుమరేషన్ ఫారమ్‌ను అందజేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ స్వయంగా ఫారమ్‌లో వివరాలు నమోదు చేసి అధికారులకు తిరిగి సమర్పించారు. ఎస్ఐఅర్ కార్యక్రమ నిర్వహణ, ఫారమ్‌ల పంపిణీ, సేకరణ విధానాలపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం ప్రతి అర్హత గల ఓటరును గుర్తించి, వారి వివరాలను సక్రమంగా నమోదు చేయడం ద్వారా పారదర్శకమైన, ఖచ్చితమైన ఓటరు జాబితా రూపొందించడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని తెలిపారు. బూత్ స్థాయి అధికారులు (బీఎల్ఓలు) ఎన్నికల సంఘానికి క్షేత్రస్థాయి ప్రతినిధులుగా వ్యవహరిస్తారని, వారి పని తీరుపైనే ఈ కార్యక్రమం విజయవంతం ఆధారపడి ఉంటుందని అన్నారు. ఇంటింటికి వెళ్లి ఓటర్లను కలిసే సమయంలో ప్రజలకు తలెత్తే సందేహాలను నివృత్తి చేస్తూ, కార్యక్రమంపై పూర్తి అవగాహన కల్పించాలని సూచించారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు కొనసాగనున్న ఈ కార్యక్రమంలో మొదటి నాలుగు నుంచి ఐదు రోజులలోపు ప్రతి ఇంటికి ఎన్యుమరేషన్ ఫారమ్‌లు పంపిణీ చేయాలని ఆదేశించారు. ఫారమ్‌లను అందజేసే సమయంలో వాటిని పూర్తి చేసి సిద్ధంగా ఉంచాలని కుటుంబ సభ్యులకు తెలియజేయాలని, తదుపరి సందర్శనలో వాటిని సేకరిస్తామని స్పష్టం చేయాలని చెప్పారు. ఫారమ్‌లు సమర్పించని పక్షంలో సంబంధిత వ్యక్తుల పేర్లు డ్రాఫ్ట్ ఓటరు జాబితాలో కనిపించవని ప్రజలకు స్పష్టంగా వివరించాలని సూచించారు. నిరక్షరాస్యులు, వృద్ధులు, దివ్యాంగులు లేదా ఫారమ్‌లు స్వయంగా నింపలేని వారికి బీఎల్ఓలు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ తెలిపారు. ప్రతి ఓటరుకి తప్పని సరిగా ఎన్యుమరేషన్ ఫారమ్ అందేలా చూడాలని, ఇంట్లో లేని సందర్భాల్లో కనీసం మూడు సార్లు సందర్శించి ఫారమ్ అందించే ప్రయత్నం చేయాలని సూచించారు. ఫారమ్ పంపిణీ జరిగినట్లు రసీదు లేదా ఇతర ఆధారాలు భద్రపరచుకోవాలని తెలిపారు.

# నాణ్యమైన వైద్య సేవలు అందించాలి

**ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి ఆకస్మికంగా తనిఖీ చేసిన మంత్రి**

**క్రిటికల్ కేర్ భవనం పనులు వేగవంతం చేసి ప్రారంభానికి సిద్ధం చేయాలి**

**పరిశుభ్రత, పారిశుధ్యం, రోగులకు మెరుగైన సేవలు, మర్యాదపూర్వక వైఖరిపై అధికారులకు స్పష్టమైన ఆదేశాలు**

**ఎస్ఐఆర్ కార్యక్రమంలో భాగంగా విడివోస్ కాలనీలో ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**





**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్య సేవలు అందించడంలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేదని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించిన మంత్రి ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, వైద్య సదుపాయాలు, పరిశుభ్రత, ఔషధాల లభ్యత, వైద్యులు, సిబ్బంది పనితీరు, తదితర అంశాలపై వైద్య అధికారులతో మాట్లాడి తెలుసుకున్నారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న రోగులు, వారి సహాయకులతో నేరుగా మాట్లాడి అందుతున్న సేవలపై వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ రోగులకు సకాలంలో నాణ్యమైన వైద్య సేవలు అందేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రతి రోగి, వారి సహాయకులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని ఆదేశించారు. వైద్యులు, సిబ్బంది రోగులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించేలా ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని సూచించారు. ఖమ్మం జిల్లా ఆసుపత్రి ప్రాంగణంలో నిర్మిస్తున్న క్రిటికల్ కేర్ భవనం పనులను త్వరితగతిన పూర్తి చేసి ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. భవనం ప్రారంభోత్సవానికి ముందే ఆసుపత్రి ప్రాంగణంలో పారిశుధ్య నిర్వహణను మరింత పటిష్ఠం చేయాలని, ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. ఆసుపత్రికి వచ్చే ప్రధాన రహదారికి ఇరువైపులా ఆకర్షణీయమైన మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని మంత్రి సూచించారు. ఆసుపత్రి ప్రాంగణంలో ఎక్కడా చెత్తాచెదారం లేకుండా పరిశుభ్ర వాతావరణం ఉండాలని, అంతర్గత రహదారులను ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉంచి గుంతలు లేకుండా అవసరమైన మరమ్మతులు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఆసుపత్రుల్లో ప్రతి రోగి సంతృప్తి చెందే విధంగా సేవలు అందించాలని మంత్రి అన్నారు. అనంతరం ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఖమ్మం నియోజకవర్గంలోని విడివోస్ కాలనీలో కొనసాగుతున్న ఓటరు మ్యాపింగ్ ప్రక్రియను మంత్రి పరిశీలించారు. ఇంటింటి సర్వే, వివరాల నమోదు ప్రక్రియ పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకుని, నిబంధనలకు అనుగుణంగా పారదర్శకంగా, వేగవంతంగా కార్యక్రమాన్ని పూర్తి చేయాలని సూచించారు. అర్హులైన ప్రతి ఓటరు వివరాలు జాబితాలో నమోదయ్యేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఆదేశించారు. ఈ తనిఖీ సందర్భంగా రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాల్ల దుర్గాప్రసాద్, ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. నరేందర్, వైద్య శాఖ అధికారులు, తదితరులు వున్నారు.

# రైతు సంక్షేమమే ప్రజా ప్రభుత్వ ధ్యేయం

**చింతకాని మండలంలో జూన్ 30న రైతు ఆశీర్వాద సభలో రైతు భరోసా నిధుల విడుదల**

**ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశంలో నంబర్ వన్.. లక్ష ఎకరాల విస్తరణ లక్ష్యం**

**చింతకాని మండలంలో సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్, ఏర్పాట్లను కలెక్టర్, పోలీస్ కమిషనర్‌లతో కలిసి పరిశీలించిన మంత్రి తుమ్మల నాగేశ్వరరావు**



**ఖమ్మం ప్రతినిధి, జూన్ 25 (పీసీడబ్ల్యూ న్యూస్) :** రైతు సంక్షేమం, వ్యవసాయాభివృద్ధి కోసం ప్రజా ప్రభుత్వం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ఎన్నో విప్లవాత్మక కార్యక్రమాలను అమలు చేస్తోందని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. గురువారం మంత్రి, మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాథపురం ప్రధాన రహదారి వద్ద ఈనెల 30న నిర్వహించే ముఖ్యమంత్రి సభ ఏర్పాట్లను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, వివిధ శాఖల అధికారులతో కలిసి సభా ప్రాంగణం, హెలిప్యాడ్, వాహన పార్కింగ్ ప్రాంతాలు, ప్రజల రాకపోకలకు అనువైన మార్గాలు, భద్రతా ఏర్పాట్లకు సంబంధించిన ప్రాంతాలను పరిశీలించారు. అనంతరం పాత్రికేయుల సమావేశంలో వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ... రైతాంగానికి ప్రత్యక్షంగా ఆర్థిక భరోసా కల్పించే కార్యక్రమాల్లో రైతు భరోసా అత్యంత ప్రధానమైనదని పేర్కొన్నారు. జూన్ 26న రైతు భరోసా నిధుల విడుదల చేయాలని తొలుత నిర్ణయించినప్పటికీ, రైతాంగం ఆకాంక్షల మేరకు జూన్ 30న నిర్వహించే "రైతు ఆశీర్వాద సభ"లో ఈ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు తెలిపారు. రైతుల అభ్యర్థన మేరకే ఈ సభకు "రైతు ఆశీర్వాద సభ"గా నామకరణం చేసినట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా రైతుల ఖాతాల్లో రైతు భరోసా నిధులను జమ చేయడానికి ప్రభుత్వం సిద్ధంగా ఉందని తెలిపారు. గత రెండు సంవత్సరాల్లో రైతుల ఖాతాల్లో దాదాపు రూ.1 లక్ష కోట్లకు పైగా వివిధ పథకాల కింద జమ చేసినట్లు అన్నారు. ఖమ్మం జిల్లా రాష్ట్ర వ్యవసాయ అభివృద్ధికి వెన్నుముక లాంటిదని అన్నారు. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా రాష్ట్రంలో 2 కోట్ల 30 లక్షల మెట్రిక్ టన్నుల వ్యవసాయ ఉత్పత్తి నమోదైందని చెప్పారు. రైతు కష్టానికి ప్రభుత్వం అండగా నిలుస్తూ అన్ని పంటలను కనీస మద్దతు ధర (ఎంఎస్పీ) ప్రకారం కొనుగోలు చేస్తోందని, ఇందుకు రూ.10 వేల కోట్లకు పైగా భారం పడుతున్నప్పటికీ రైతు ప్రయోజనాల కోసం ప్రభుత్వం వెనుకాడటం లేదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో 15 లక్షల మెట్రిక్ టన్నుల మొక్కజొన్నను కొనుగోలు చేసినట్లు తెలిపారు. మొక్కజొన్న రైతులకు రావలసిన చెల్లింపులు త్వరలోనే వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తామని తెలిపారు. ప్రత్యామ్నాయ పంటల సాగుకు ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ముఖ్యంగా ఆయిల్ పామ్ సాగులో తెలంగాణ దేశంలోనే నంబర్ వన్ స్థానంలో ఉందని పేర్కొన్నారు. ఆయిల్ పామ్ సాగు చేసే రైతులకు సబ్సిడీలు అందిస్తున్నామని, రాబోయే కాలంలో మరో లక్ష ఎకరాల్లో ఆయిల్ పామ్ సాగును విస్తరించే లక్ష్యంతో ముందుకు సాగుతున్నామని తెలిపారు. రైతుకు మించిన శాస్త్రవేత్త మరొకరు లేరని పేర్కొన్న మంత్రి, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని రైతులు వినియోగించుకోవాలని సూచించారు. వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం పొందేందుకు ప్రభుత్వం అందుబాటులో ఉంచిన యాప్‌లను డౌన్‌లోడ్ చేసుకోవాలని కోరారు. వ్యవసాయానికి అవసరమైన ఎరువులన్నీ సమృద్ధిగా అందుబాటులో ఉన్నాయని, గతంలో కొందరు వ్యాపారులు, డీలర్లు యూరియాను నిల్వ ఉంచి బ్లాక్ మార్కెట్‌కు తరలించే పరిస్థితులు ఉండేవని గుర్తు చేశారు. ప్రస్తుతం సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగిస్తూ పారదర్శక వ్యవస్థను అమలు చేస్తున్నామని, చిన్న, సన్నకారు రైతులకు అవసరమైన యూరియాను ఒకేసారి అందించే చర్యలు చేపట్టామని తెలిపారు. యాప్ ఆధారిత పర్యవేక్షణ వల్ల డీలర్లు, దొంగ మార్కెట్ వ్యవహారాలకు అవకాశం లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతిపక్షాలు ప్రజాభిమానాన్ని కోల్పోయి రైతులను తప్పుదారి పట్టించే ప్రయత్నాలు చేస్తున్నాయని విమర్శించారు. రైతుల అభ్యున్నతే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని స్పష్టం చేశారు. జూన్ 28వ తేదీ నుంచి రైతాంగం, వ్యవసాయ సాంకేతికత, పశుసంపద అభివృద్ధికి సంబంధించిన 150కు పైగా స్టాళ్లను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రైతులు ఈ ప్రదర్శనలను సందర్శించి ఆధునిక వ్యవసాయ పద్ధతులు, సాంకేతిక పరిజ్ఞానం, పశుసంవర్ధక రంగంలోని నూతన అవకాశాలపై అవగాహన పెంపొందించుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, సుడా చైర్మన్ పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, అదనపు కలెక్టర్ పి. శ్రీజ, ట్రైనీ కలెక్టర్ పారస్ కుమార్, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.